
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
సోమవారం 18 నవంబరు 2024





వరద నిధులు.. కృష్ణార్పణం

- నదిలో నీరు తగ్గిన నెలల తర్వాత పనులు
- అవసరమైనవి వదిలేసి ఇష్టారీతిన పనులు
- కొరవడిన పర్యవేక్షణతో అనవసరపు పనులు
- జంగిల్ క్లియరెన్స్ పేరుతో తూతూమంత్రంగా
- కరకట్టకు ఇరువైపులా నీడనిచ్చే చెట్ల తొలగింపు

వరద పనులు అంటే వరదకి ముందో.. వరద సమయంలో అత్యవసరంగానో చేస్తారు. కానీ నీటిపారుదల శాఖ మాత్రం దీనికి పూర్తి విరుద్ధంగా చేస్తుంది. నిధులు ఉన్నాయి.. పనులు చేస్తున్నామన్నట్లు చేస్తున్నారే కానీ అవి అవసరమా.. వాటి వల్ల ఉపయోగమా అన్న విషయాలను పట్టించుకోవడంలేదు. వరద వచ్చిపోయిన నెలల తర్వాత వరద పనుల పేరుతో తూతూమంత్రంగా చేస్తోంది. పనికి రాని కంప చెట్లను తొలగించాల్సిందిపోయి కరకట్టకు ఇరు వైపులా నీడనిస్తున్న వృక్షాలను నేలకూల్చేస్తున్నారు. ఏ పని ఏ తరహాలో చెయ్యాలనే సూచనలు చేసే నాథుడేలేడు. ఆర్సీ విభాగంలో సిబ్బంది కొరత, ఉన్న సిబ్బంది, అధికారులు కొత్తగా బదిలీపై వచ్చిన వారు కావడంతో పనులపై పర్యవేక్షణ లోపించింది. ఎక్సకవేటర్ ఆపరేటర్‌కు ఏది చేస్తే అదే పనిగా గాలికొదిలేశారు.


వల్లభాపురం స్లూయిజ్ దగ్గర్లో కరకట్ట రోడ్డుకు దూరంగా ఉన్న చెట్టును ఎక్సకవేటర్‌తో విరిచేసిన చిత్రం

తెనాలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి ఇటీవల రికార్డు స్థాయిలో వచ్చిన వరదతో కరకట్ట అంచులకు నీరు చేరింది. మరికొన్నిచోట్ల పైనుంచి కూడా ప్రవహించింది. ఆ సమయంలో అత్యవసర మరమ్మతులకు ప్రభుత్వం కుడి, ఎడమ కరకట్టలకు రూ.48 లక్షలు కేటాయించింది. వరద వచ్చాక కేవలం ఇసుక మూటలు, అత్యవసరమనుకున్నచోట ఎక్సకవేటర్లతో కట్టలు సరిచేశారు. మిగిలిన నిధులతో కరకట్టకు ఇరువైపులా పెరిగిన ముళ్ల కంపను తొలగించడం, పేరుకుపోయిన మట్టి, ఇసుకను వెలుపలకు నెట్టేయడం, చెత్త కుప్పలను తొలగించడం వంటి పనులు చెయ్యాలి. కరకట్ట అంచులు ఎక్కడైనా బలహీనంగా ఉంటే వాటిని మట్టితో బలపరిచే పనులు చెయ్యాలి. అయితే వరద సమయంలో ఇసుక మూటలువేసే పనులు చేసిన అధికారులు ఆ తర్వాత మిగిలిన నిధులతో పనులు చేశామనిపించే విధంగా తూతూమంత్రంగా చేయడం విశేషం. అసలు పనికి బదులు అనవసరపు పనులు చేయడంపై విమర్శలు వస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు.


ప్రాతూరు దగ్గర వేపచెట్టును అడ్డులేకున్నా వేర్లు కదిలిపోయి బయటకువచ్చేలా నేలపైకి నెట్టేసిన చిత్రం

ముళ్లకంప వదిలేసి..

కృష్ణానదికి కుడి కరకట్టపై వారధి నుంచి మున్నంగి వరకు 20 కి.మీటర్ల మేర జంగిల్ క్లియరెన్స్, కరకట్ట కోత, బలహీనపడటం వంటి చోట్ల మరమ్మతులు చెయ్యాలి. దీని కోసం రూ.9 లక్షల వరకు మంజూరు చేశారు. అయితే వరద సమయంలో పెదకొండూరు-వల్లభాపురం మధ్య కొన్నిచోట్ల మాత్రమే ఇసుక మూటలు వేశారు. వరద సమయంలో కంప తొలగింపు అవకాశమేలేదు. దీంతో వరద తర్వాత ఇప్పుడు ఈ పనులు చేపట్టారు. అయితే చేస్తున్న కొద్దిపనులు కూడా సంపూర్ణంగా చేయడంలేదు. రోడ్డుపైకి అడుగు వెడల్పులో మట్టిపేరుకుపోయి దానిపై కంప మొలచినా కనీసం దానిని కూడా తొలగించడంలేదు. కరకట్టకు ఇరువైపులా ఏడేళ్ల నుంచి పెంచుతున్న చెట్లను నేలకూల్చడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాతూరు, చిర్రావూరు, గొడవర్రు, అత్తలూరివారిపాలెం, వల్లభాపురం ప్రాంతాల్లో నీడనిచ్చే చెట్లను నేలకూల్చేశారు. అడ్డొచ్చిన కొమ్మలు కాకుండా కరకట్టకు మూడు నుంచి ఐదు అడుగుల దూరంలో ఉన్న చెట్లను కూడా వేళ్లతో తొలగిస్తున్నారు. దీనిపై ఆర్సీ విభాగం జేఈ విజయరాజును ప్రశ్నిస్తే చెట్లు కొట్టేయమని చెప్పలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. వరద పనులు అప్పట్లో అత్యవసరం అనుకున్నవి చేశామని, మిగిలిన పనులను ప్రస్తుతం చేస్తున్నామని చెప్పారు.


చిర్రావూరు దగ్గర చిన్నపాటి కంపచెట్టు కూడా తొలగించలేని విధంగా మట్టితో స్లోప్ వదిలేసి, పైపైన గీరేసి వదిలేసిన చిత్రం

భయం భయంగా కరకట్ట

కరకట్టకు ఇరువైపులా ఇంగ్లీష్ తుమ్మ, ఇతర ముళ్ల పొదలు దట్టంగా అల్లుకుపోయాయి. కుడి కరకట్టకు వారధి నుంచి పెనుమూడి వరకు చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. వీటి కారణంగా వరద సహాయ చర్యలకి, కరకట్ట అత్యవసర పనులకు ఇబ్బందిపడాల్సి వచ్చింది. కరకట్ట ఆధునికీకరణ జరిగిన ప్రాంతంలోనే ఇలా ఉంటే, పనులు ఆగిపోయిన ప్రాంతంలో పరిస్థితి దారుణంగా ఉంది. వారధి దగ్గర కరకట్ట ప్రారంభమైన దగ్గర కొంతమేర విస్తరణ జరగలేదు. అయినా ఇక్కడ కంప చెట్ల సమస్య రాలేదు. విస్తరణ జరిగిన చిర్రావూరు-కొల్లిపర మధ్య మరింత దారుణంగా మారింది. దుగ్గిరాల మండలం పెదకొండూరు దగ్గర రోడ్డు అధ్వానంగా ఉంటే, కంప పెరిగి మరింత సమస్యగా మారింది. కరకట్ట ఆధునికీకరణకు ముందే పెదకొండూరు-వల్లభాపురం మధ్య డబుల్ రోడ్డు నిర్మాణం జరిగింది. దీంతో 4 కిలోమీటర్ల రోడ్డుపై ఆధునికీకరణ సమయంలో ఒక్క పని కూడా చెయ్యలేదు. దీంతో ఈ ప్రాంతంలో రెండు వైపులా ముళ్ల కంప కమ్మేసి, రోడ్డు కుచించుకుపోయింది. కొల్లిపర-చిలుమూరు మధ్య కొన్నిచోట్ల కంప పెరిగింది. కొల్లూరు-ఈపూరు, దోనేపూడి-వెల్లటూరు మధ్య రోడ్డు పనులు జరగలేదు. దీంతో కమ్మేసిన చెట్లను కూడా తొలగించే చర్యలు చేపట్టలేదు. ఈ ప్రాంతాల్లో మనిషి అడుగు పెట్టడం కూడా గగనమే. ఇటువంటి చోట్ల ఒక్కపని కూడా చెయ్యలేదు. జంగిల్ క్లియరెన్స్ అవసరం ఉన్నచోట కాకుండా కంపచెట్లు పెద్దగా లేనిచోట పనులు చేశామనిపించుకోవడం విశేషం.

ఆర్జేడీ కార్యాలయం.. ప్రక్షాళన

- దీర్ఘకాలంగా తిష్ఠవేసిన ఉద్యోగుల బదిలీ
- ఆఫీస్ బేరర్ సర్టిఫికెట్‌తో ఓ ఉద్యోగి పదేళ్లుగా విధులు
- అక్రమాలకు అండగా ఉన్నవారి స్థానచలనానికి కార్యాచరణ

గుంటూరు(విద్య), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్య ప్రాంతీయ కార్యాయం(ఆర్జేడీ)లో దీర్ఘకాలంగా తిష్ఠవేసి అక్రమాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న ఉద్యోగులకు స్థానచలనం కలిగించేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇప్పటికే ఏడీ స్థాయిలో ఉన్న ఉద్యోగిని కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేశారు. మరో ఇద్దరు ఉద్యోగుల్ని కూడా బదిలీ చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. మిగిలిన సిబ్బందిని దశలవారీగా బదిలీ చేయాలని నిర్ణయించారు. గుంటూరు డీఈవో కార్యాలయ ఆవరణలోని ఆర్జేడీ పరిధిలో గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, నెల్లూరు జిల్లాలు ఉన్నాయి. ఆయా జిల్లాల పరిధిలోని హెచ్ఎం స్థాయి ఉపాధ్యాయులు, ఎంఈవోల సర్వీస్ రూల్స్, ప్రైవేటు స్కూల్స్ గుర్తింపు, బీఈడీ, డీఈడీ కళాశాల నిర్వహణ, పనితీరు, తనిఖీలు, ప్రైవేటు స్కూల్స్‌లో అదనపు తరగతులకు అనుమతులు తదితర విషయాలను ఆర్జేడీ కార్యాలయం పర్యవేక్షిస్తోంది. ఇప్పటిదాక ఇక్కడ పనిచేసిన అధికారుల మెతక వైఖరిని అడ్డం పెట్టుకుని ఉద్యోగులు చెలరేగిపోయారన్న విమర్శలున్నాయి. అక్రమ పద్ధతుల్లో సంవత్సరాల తరబడి ఇక్కడే తిష్ఠవేసి సంపాదనలో మునిగిపోయారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ఇటీవల బాధ్యతలు చేపట్టిన కార్యాలయ అధికారి ఉద్యోగులపై అక్రమాలపై దృష్టిపెట్టినట్లు సమాచారం. కొన్ని విషయాల్లో ఆయన్ని సైతం తప్పుదోవ పట్టించేందుకు ఉద్యోగులు ప్రయత్నించినట్లు సమాచారం. దీంతో విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఆయన కార్యాలయ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టినట్లు సంఘాల నాయకులు చెబుతున్నారు.

- ఇక్కడ కీలకంగా పనిచేసే ఓ ఉద్యోగి ప్రకాశం జిల్లా నుంచి డిప్యూటేషన్‌పై వచ్చాడు. జిల్లాకు చెందిన ఓ సంఘం నేత నుంచి ఆఫీస్‌బేరర్ సర్టిఫికెట్ తీసుకువచ్చి దాదాపు పదేళ్ళుగా కార్యాలయంలో ఉద్యోగం వెలగబెడుతున్నాడు. వాస్తవానికి ప్రకాశం జిల్లాకు చెందిన ఈ ఉద్యోగికి గుంటూరు జిల్లాకు చెందిన ఉద్యోగ సంఘ నాయకుడు ఇచ్చే ఆఫీస్ బేరర్ సర్టిఫికెట్ ఉపయోగపడదు. అయితే అధికారుల్ని మాయచేసి ఇప్పటికీ ఇక్కడే కొనసాగుతున్నాడు. కార్యాలయంలోని సెక్షన్లలో ఎవరి ఫైల్ ఎక్కడ ఉంది.. దాని స్థితి ఏమిటి.. పరిష్కారానికి ఎంత చెల్లించాలనేది ఈ ఉద్యోగి నిర్ణయిస్తాడని సమాచారం.
- ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన మరో ఇద్దరు ఉద్యోగులు దాదాపు ఐదేళ్ల నుంచి ఇక్కడే పనిచేస్తున్నారు. కార్యాలయానికి పనుల కోసం వచ్చే వారిని విభాగాలకు తీసుకెళ్ళి బేరాలు కుదర్చడంలో వీరుదిట్ట అనే ఆరోపణలు ఉన్నాయి.
- కార్యాలయంలో సూపర్‌మెన్‌గా పేరున్న ఓ ఉద్యోగి దాదాపు ఏడేళ్ల నుంచి పనిచేస్తున్నాడు. ఈ సూపర్‌మెన్ అక్రమాలు సూపర్‌గానే ఉంటాయన్న ఆరోపణలున్నాయి. ప్రతి ఫైలుకు రేటు పెట్టి వసూలు చేస్తాడని సమాచారం. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు ఎక్కువ కాలం ఇతర జిల్లాల్లో ఇన్‌చార్జీలుగా పనిచేశారు. దీంతో ఈ సూపర్‌మెన్ ఫైల్స్‌ను ఏకంగా అధికారి పనిచేసే వద్దకే తీసుకెళ్లి పరిష్కరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- డీఈడీ కళాశాల గుర్తింపు, రెన్యువల్‌లో హైదరాబాద్‌లో జరిగిన అక్రమ వసూళ్ల విషయంలో గుంటూరు ఆర్జేడీ కార్యాయలంలో పనిచేసిన ఓ అధికారి కీలకంగా ఉన్న విషయం తెలిసిందే. వినుకొండ ప్రాంతానికి చెందిన ఓ డీఈడీ కళాశాల యాజమానితో కలిసి అక్రమ వసూలు చేస్తూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన సంఘటన అప్పట్లో రాష్ట్రంలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ అధికారికి కర్త, కర్మ, క్రియగా పని చేసిన ఉద్యోగులు ఇప్పటికీ ఆర్జేడీ కార్యాలయంలో ఉన్నారు. ఇలా దాదాపు పది మందిపైగా ఉద్యోగులు నాలుగు నుంచి పదేళ్లకు పైగా ఇక్కడ పనిచేస్తున్నారు. ఆయా ఉద్యోగులకు దశలవారీగా స్థాన చలనం కలిగించేలా ఏర్పాట్లు సాగుతున్నాయి.

టీ తెమ్మనగానే తెచ్చిచ్చిన పోలీసులు

- బోరుగడ్డకు రాచమర్యాదలపై మరో వీడియో విడుదల

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు అరండల్‌పేట పోలీస్‌స్టేషన్లో జరిగిన రాచమర్యాదలకు సంబంధించి మరో వీడియో విడుదలైంది. మూడు, నాలుగు రోజులకు ఒకసారి ఒక్కో వీడియో విడుదలవడం కలకలం రేపుతోంది. తాజాగా విడుదలైన మూడో వీడియోలో.. స్టేషన్లో కుర్చీలో కూర్చున్న రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ టీ తీసుకుని రమ్మంటూ హుకుం జారీ చేయడం ఆ వెంటనే కానిస్టేబుల్ ఉరుకులు పరుగుల మీద తీసుకొచ్చి ఇవ్వడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇప్పటికే విడుదలైన రెండు వీడియోల్లోనూ స్టేషన్‌లో రౌడీషీటర్ బోరుగడ్డకు రాచమర్యాదలు జరిగినట్లు స్పష్టంగా కనిపించింది. తాజాగా విడుదలైన వీడియోలోనూ బోరుగడ్డ పోలీసులపై జులుం ప్రదర్శించడం చర్చనీయాంశంగా మారింది. విడతల వారీగా వీడియోలు విడుదలవుతుండటంపై పోలీస్ శాఖలో చర్చ జరుగుతుంది. మూడు నాలుగు రోజులకు ఒకసారి బోరుగడ్డ రాచమర్యాదలకు సంబంధించిన వీడియోలు వైరల్ అవుతుండటంతో పోలీసుల తీరుపై విమర్శలు వస్తున్నాయి.

క్రీడలతో వ్యక్తిత్వ వికాసం

- వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ కరుణాసాగర్
- ఉత్సాహంగా వర్సిటీ క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదపడతాయని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ డాక్టర్ జి.కరుణాసాగర్ తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్యపోటీలు ఆదివారం బాపట్ల వ్యవసాయ కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యలో క్రీడలు అంతర్భాగాలన్నారు. విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలని, నిత్యం సాధన చేయాలని చెప్పారు. క్రీడలను ప్రోత్సహించడంతో పాటు విద్యార్థులకు కావాల్సిన మౌలిక అవసరాలను గుర్తించి క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేస్తామన్నారు. విద్యార్థులు క్రీడలను తమ రోజువారి జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యూనియన్ బ్యాంక్ గుంటూరు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.జవహర్ మాట్లాడుతూ విద్యార్థి జీవితం అపురూపమైనదని, ఈ కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి, డాక్టర్ ఎన్టీఆర్ కాలేజీ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అసోసియేట్‌డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్, డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్, ఫిజికల్ ఎడ్యుకేషనల్ విభాగాధిపతి డాక్టర్ రవికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జి.కరుణా సాగర్

మళ్లీ కలుద్దాం



- కేరింతలతో సందడి చేసిన బాలబాలికలు
- ఘనంగా ముగిసిన వీవీఐటీ బాలోత్సవ్ -2024


7

- గ్రీవెన్సకు ఇక నుంచి ఆధార్ తప్పనిసరి
  - ఎస్పీ సతీష్‌కుమార్
- మహిళా న్యాయవాది ఆత్మహత్య
- సోషల్ మీడియా కన్వీనర్ అరెస్టు
- ఎంపీడీవోను దూషించిన వైసీపీ నేత అరెస్టు

పోటెత్తిన భక్తజనం

- సూర్యలంక సముద్ర తీరం కిటకిట
- పౌర్ణమి కంటే ఎక్కువగా తరలివచ్చిన జనం
- 180 మంది పోలీసుల బందోబస్తు.. మరబోట్లు, డ్రోన్లతో గస్తీ


సూర్యలంక సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తజనం


మరబోటుపై సముద్రంలో గస్తీ నిర్వహిస్తూ భక్తులకు హెచ్చరికలు చేస్తున్న రూరల్ పోలీసులు

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరం పర్యాటకులు, భక్తులతో పోటెత్తింది. పవిత్ర కార్తీక మాసంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు బాపట్ల నుంచే కాకుండా దూరప్రాంతాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాల్లో పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వచ్చిన భక్తుల పుణ్యస్నానాలతో సముద్రతీరం పులకరించింది. కార్తీక పౌర్ణమి రోజు కంటే ఎక్కువ మంది భక్తులు తరలిరావడంతో తీరం కిక్కిరిసిపోయింది. దీంతో 180 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గజ ఈతగాళ్లతో, సముద్రజలాల్లో మరబోట్లపై గస్తీ, డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. స్నానాలు ఆచరిస్తున్న వారిని లోతుకు వెళ్ళనీయకుండా అప్రమత్తం చేస్తూ మైక్‌లో పోలీసు సిబ్బంది సూచనలు చేశారు. అలల తాకిడికి కొట్టుకుపోతున్న వారిని కాపాడారు. డీఎస్పీ రామాంజనేయులు, సీఐలు గంగాధర్, హరికృష్ణ, మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐలు శ్రీనివాసరావు, శ్రీనువాసులు, ఏఎస్ఐ అమరేశ్వరరావు తదితరులు భద్రతా ఏర్పాట్లలో పాల్గొన్నారు.





మళ్లీ కలుద్దాం

● కేరింతలతో సందడి చేసిన బాలబాలికలు ● ముగిసిన వీవీఐటీ బాలోత్సవ్-2024

పెదకాకాని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నంబూరు లోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ) కళాశాలలో మూడు రోజులపాటు వైభవంగా జరిగిన ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీ బాలోత్సవ్-2024 వేడుకలు ఆదివారంతో ముగిశాయి. కన్నుల పండువగా జరిగిన ఈ వేడుకల్లో దేశవ్యాప్తంగా వందలాది పాఠశాలల నుండి వేలాది మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు ఈ వేడుకకు 25,000 మంది హాజరయ్యారు. 20 అంశాలు 61 విభాగాలుగా జరిగిన ఈ పోటీలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతోపాటుగా రెండు ప్రత్యేక బహుమతులను పోటీదారులకు అందించారు. బాలల వికాసం, సంస్కృతీ సాంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ పోటీలకు తొలి రోజు నుండి విశేష స్పందన లభించింది. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మూడవరోజున విచిత్ర వేషధారణ, శాస్త్రీయ, జానపద బృంద నృత్యాల నడుమ వీవీఐటీ ప్రాంగణంలో కోలాహలంగా మారింది. జానపద నృత్యాలు ప్రేక్షకులను ఉర్రూతలు ఊగించాయి. 52 బృందాలు 3 వేదికల వద్ద జాతర వాతావరణాన్ని సృష్టించాయి. 36 శాస్త్రీయ నృత్య బృందాలు రెండు వేదికలపై ఉత్సాహంగా సాగాయి. విచిత్ర వేషధారణ పోటీలలో పాల్గొన్న చిన్నారులు విశేషంగా ఆకర్షించారు. వారు ప్రదర్శించిన ప్రదర్శనలు తెలుగు కళలను సాంప్రదాయాలకు అద్దం పట్టేలా ఉన్నాయి. మట్టితో బొమ్మలు, కాగితపు చేతి బొమ్మలు అంశాలలో చిన్నారులు ఆసక్తిగా పాల్గొని ఆయా ఆకృతులను రూపొందించారు. సమాజానికి హితవు పలికేలా వారి ప్రదర్శనలు ఉన్నాయి.







గుంటూరు ఘనతలో వీవీఐటీ కూడా

నాగార్జున సిమెంట్స్ గ్రూప్ ఈడీ వాసిరెడ్డి విక్రాంత్

గుంటూరు ఘనతలో వీవీఐటీ కూడా చేరుతుందని ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగార్జున సిమెంట్స్ గ్రూప్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వాసిరెడ్డి విక్రాంత్ అన్నారు. ఈ సందర్భంగా గుంటూరు ఘనత తెలుపుతూ ఆయన పాడిన పద్యం ఆకట్టుకుంది.విక్రాంత్ మాట్లాడుతూ భాషసాహిత్యంపై పట్టు ఉంటే జీవితంలో విజయం సులువు అని తెలిపారు. వైవిధ్యం గల సంస్కృతి, భాషా మన సొంతం అని వాటిని పరి రక్షించుకోవాలని అన్నారు. కళలతో ఆనందంతో పాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తాను నమ్ముతానని చెప్పారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి టెక్నాలజీకి కూడా సృజనాత్మకత అవసరమని అన్నారు. సృజనాత్మక, నాయకత్వం లాంటివి కళలలో ఉంటాయని తెలిపారు.

ఎంపీడీవోను దూషించిన వైసీపీ నేత అరెస్టు

నాదెండ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిరుమామిళ్ళకి చెందిన వైసీపీ నేత సింగారెడ్డి కోటిరెడ్డిని ఆదివారం అరెస్టు చేశారు. మండల పరిషత్ స్థలంలో జరిపిన అక్రమ నిర్మాణాలపై గత శుక్రవారం ఎంపీడీవో ఎస్.స్వరూపరాణి విచారణ జరుపుతుండగా ఆమె విధులను ఆయన అడ్డగించారని, కులం పేరుతో దుర్భాషలాడాడని పోలీసులకు ఎంపీడీవో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు, రూరల్ సీఐ సుబ్బనాయుడు చిరుమామిళ్ళకి ఆదివారం ఉదయం వెళ్లి విచారణ జరిపారు. ఈ క్రమంలో కోటిరెడ్డి పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేసి అరెస్టు చేశారు.

సోషల్ మీడియా కన్వీనర్ అరెస్టు

పిడుగురాళ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గ వైసీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ పులిచర్ల సురేష్‌రెడ్డిపై కేసు నమోదైనట్లు పిడుగురాళ్ల సీఐ ఎస్ వెంకటరావు తెలిపారు. ఓ మహిళ ఫిర్యాదుతో పిడుగురాళ్లకు చెందిన పులిచర్ల సురేష్‌రెడ్డిని శనివారం రాత్రి అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. తనపై లైంగిక వేధింపులకు పాల్పడు తున్న వేధింపులకు పాల్పడు తున్నాడంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సురేష్‌రెడ్డిని అరెస్టు చేసినట్లు చెప్పారు. కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడు శ్రీధర్

పిడుగురాళ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక సౌజన్య హాస్పిటల్ వైద్యులు కిష్టంశెట్టి శ్రీధర్ మృతి చెందారు. దాచేపల్లి నుంచి కారులో ప్రయాణిస్తుండగా ప్రమాదం జరిగింది.

పాఠశాలల బలోపేతం బాధ్యత ఉపాధ్యాయులదే

● ఎమ్మెల్సీ అశోక్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అశోక్‌బాబు

గుంటూరు(విద్య), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎమ్మెల్సీ జేఏసీ మాజీ చైర్మన్ వీ అశోక్‌బాబు అన్నారు. స్థానిక కొత్తపేటలోని జలగం రామారావు మున్సిపల్ స్కూల్‌లో ఆదివారం నోబుల్ టీచర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్,ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి ఎన్‌డీఏ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ హైమారావు మాట్లాడుతూ జీవోనం 84 రద్దు చేసి నగరంలో అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలలకు గ్రేడ్- హెచ్ఎంలు, అన్ని పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్స్ అవసరమనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

సౌత్ ఇండియా పోటీలకు 13 మంది లిఫ్టర్లు

మంగళగిరి సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని సేలంలో ఈ నెల 22 నుంచి 24 వరకు జరుగనున్న సౌత్ ఇండియా ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేందుకు గుంటూరు జిల్లా నుంచి 13 మంది లిఫ్టర్లు రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు పవర్ లిఫ్టింగ్ అసోసి యేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మాకుల



ఎంపికైన లిఫ్టర్లతో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

విజయభాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. మహిళల సబ్‌జూనియర్స్‌లో శ్రావణి (43 కిలోలు), లక్ష్మీ వినయశ్రీ (84 కిలోలు), జూనియర్స్‌లో ఎం.షానూన్ (47 కిలోలు), ఎస్కే షబీనా (84 కిలోలు), చాతుర్య (76 కిలోలు), సీనియర్స్‌లో బి.చంద్రిక (76 కిలోలు), పురుషుల సబ్ జూనియర్స్‌లో హేమవర్ధన్ (74 కిలోలు), నాగగణేష్ (93 కిలోలు), జూనియర్స్‌లో రమేష్‌శర్మ (76 కిలోలు), పృథ్వీ (105 కిలోలు), ఎస్ కౌశిక్ (93 కిలోలు), భరత్‌కుమార్ (59 కిలోలు) ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన లిఫ్టర్లను ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్య నారాయణ, సౌత్ఇండియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సకల కోటేశ్వరరావు అభినందించారు.

రాష్ట్రాభివృద్ధిలో 'గౌడ' కీలకం : మంత్రి అనగాని

తాడేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధిలో గౌడ జాతి కీలకమని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని ఇప్పటంలో మండల గౌడ సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ పలగాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి, సినీ నటుడు సుమన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'గౌడ' అంటే వెనుకబడిన వర్గంగా కాకుండా రాష్ట్రంలో అభివృద్ధిని కాంక్షించే పెద్ద కులమని అన్నారు. గతంలో సర్దార్ పాపారాయుడు పౌరుషం, సర్దార్ గౌతు లచ్చన్న ధైర్యంతో గౌడ కులం ముందుకొచ్చిందన్నారు. రాబోయే రోజుల్లో గౌడల మరింత అభ్యున్నతితో ముందుకెళ్లేలా కృషి చేస్తామన్నారు. సుమన్ మాట్లాడుతూ ఆత్మీయత, ఐక్యతకు ప్రతీక వనసమారాధన అని అన్నారు. భవిష్యత్ తరాలకు మేలు చేకూర్చే వృక్షజాతిని సంరక్షిం చాలనే నిగూఢ సందేశాన్ని వనసమారాధన ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, డాక్టర్ పలగాని శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ ఈవి నారాయణ, తాడేపల్లి మండల గౌడ సంఘం నాయకులు కంచర్ల కాశయ్య, లచ్చి తులసీదాస్, పలగాని నాగబాబు, ఐఎఫ్ఎస్ అధికారి శివప్రసాద్ పాల్గొన్నారు.



వేదికపై మంత్రి అనగాని, సినీనటుడు సుమన్, కొనకళ్ల నారాయణ తదితరులు

పెదకాకాని మల్లన్న సన్నిధిలో భక్తుల సందడి

పెదకాకాని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస మూడో ఆదివారం సందర్భంగా పెదకాకానిలోని మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో వేకువజాము నుంచే భక్తుల సందడి నెలకొంది. కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. యజ్ఞాల బావి వద్ద కార్తీకమాస స్నానమాచరించిన భక్తులు భక్తి శ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపారాధనలు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్లలో త్వరిత గతిన దర్శనము చేసుకున్న భక్తులు స్వామి వారికి అభిషేకాలు జరిపించారు. పొంగళ్లను నివేదించారు ఆలయ ప్రాంగణంలో మేళతాళాల నడుమ ప్రభలతో మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్లలో భక్తులకు ఉచితంగా పాలు, మజ్జిగ, మంచినీళ్ళ బాటిల్స్ అందించారు. భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవా రుసుములు, ప్రసాదం విక్రయము, అన్నప్రసాద విరాళాల ద్వారా రూ. 6,50,000 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

విజయవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కారుకు బస్సు అడ్డం వచ్చిందని ఆర్టీసీ బస్సు డ్రైవర్‌తో గొడవపడి దాడిచేసిన వ్యక్తులపై ఆదివారం కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్లకు చెందిన కోటేశ్వరరావు తెనాలి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం తెనాలిలో ప్రయాణికులను ఎక్కించుకుని విజయవాడ బయలుదేరాడు. విజయవాడ బస్‌స్టేషన్‌లోకి వెళుతుండగా దుర్గమ్మ గుడివైపు నుంచి అతి వేగంగా వచ్చిన ఇన్నోవా కారు బస్సును ఢీకొట్టబోయింది. కారులో ఉన్న డ్రైవర్, మరో ఐదుగురు కారులో నుంచి దిగి బస్సును అడ్డుకుని, డ్రైవర్ కోటేశ్వరరావుతో గొడవపడ్డారు. అనంతరం డ్రైవర్‌పై దాడి చేశారు. స్థానికులు వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బస్సు డ్రైవర్ కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. దాడి చేసిన వారి వివరాలు తెలియరాలేదు. కారును పోలీసుస్టేషన్‌కు తరలించారు. దాడికి పాల్పడిన వారిలో కొందరు మద్యం తాగి ఉన్నట్లు సమాచారం.

విద్యార్థినులకు అస్వస్థత

మాత్రలు మింగి స్పృహ తప్పిన వైనం.. గుంటూరుకు తరలింపు

సత్తెనపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మాత్రలు మింగి విద్యార్థినిలు అస్వస్థతకు గురైన సంఘటన పట్టణంలోని ఎస్సీ కళాశాల బాలికల సంక్షేమ వసతి గృహంలో ఆదివారం రాత్రి జరిగింది. వసతి గృహంలో ఇంటర్ చదువుతున్న సనిత, అఖిల అనే ఇద్దరు విద్యార్థినులు అధిక మొత్తంలో డోలో - 650 మాత్రలు మింగి అశ్వస్థతకు గురయ్యారు. హాస్టల్ సంక్షేమ అధికారి రాణెమ్మ వారిని ఏరియా వైద్యశాలకు తరలించగా, వైద్యులు చికిత్సనందిస్తున్నారు. పోలీసులు సమాచారం అందించిన అనంతరం ఆ విద్యార్థినులను మెరుగైన వైద్యసేవల నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఆస్పత్రి వైద్య సిబ్బంది తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సిఫార్సు చేయాలని ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ అన్నారు. ఆదివారం ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న అంబేద్కర్ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని మంత్రి మండలి తీర్మానంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 23న కర్నూల్లో బీసీ రాష్ట్ర స్థాయి ప్రతినిధుల శంఖారావాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓబీసీ సంక్షేమ సంఘం నూతన రాష్ట్ర అధ్యక్షుడు వై నాగేశ్వరరావు యాదవ్, రాష్ట్ర ఇన్‌చార్జీ వై నూకాలమ్మలను సత్కరించారు. సమావేశంలో బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషు, కలిశెట్టి లక్ష్మణరావు, భాను ప్రకాష్, ప్రవీణ్, గద్దం శంకర్ యాదవ్, అంకాల శ్రీనివాసరావు, నిర్మల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా న్యాయవాది ఆత్మహత్య

తెనాలి క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బార్ కౌన్సిల్ సభ్యురాలు, తెనాలి కోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్న కాకుమాను కిరణ్మయి (37) శనివారం సాయంత్రం ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై భర్త గిరిధరరావు ఆదివారం ఉదయం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక కొత్తపేటలో నివాసం ఉండే న్యాయవాది కిరణ్మయి ఇటీవల జరిగిన న్యాయమూర్తుల నియామక పరీక్షల్లో ఆరు మార్కులు తేడాతో ఫెయిల్ అయింది. కొంతకాలం క్రితం టైఫాయిడ్ జ్వరంతో అనారోగ్యానికి గురైంది. దీంతో మానసికంగా తీవ్రంగా ఇబ్బంది పడుతూ ఆత్మహత్య చేసుకుని ఉంటుందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నటు తెలిపారు. ఆమెకు ఇద్దరు సంతానం. పదిహేడేళ్ల కుమారుడు సాత్విన్, ఏడేళ్ల వయసు ఉన్న కుమార్తె నిహారిక ఉన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు ఇక నుంచి ఆధార్ కార్డు తప్పనిసరి

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతి సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగే ప్రజా ఫిర్యాదులు - పరిష్కారాల వ్యవస్థ కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదు దారులు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డు తీసుకురావాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలంతా దీనిని గమనించి గ్రీవెన్స్‌కు వచ్చేవారు తప్పని సరిగా తమ వెంట ఫిర్యాదుతో పాటు ఆధార్ కార్డు కూడా తీసుకురావాలని ఎస్పీ కోరారు.

ఫ్లోర్‌బాల్ పోటీలో గుంటూరు ప్రథమం

చిలకలూరి పేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్ 12, 17 బాల బాలికల ఫ్లోర్ బాల్ పోటీలలో అండర్ 17 బాలికల విభాగంలో గుంటూ రు, బాపట్ల, ఎన్టీఆర్ జిల్లా జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. బాలుర విభాగంలో కృష్ణా ప్రథమ స్థానం, బాపట్ల ద్వితీయ స్థానం, కడప జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. చిలకలూరిపేట మార్కెట్ యార్డు ఆవరణలో ఆదివారం జరిగిన ఈ పోటీలలో 10 జిల్లాల జట్లు పాల్గొన్నాయి. కాగా, అండర్ 12 బాలుర విభాగంలో బాపట్ల, కడప, ఎన్టీఆర్ జిల్లాల జట్లు, బాలికల విభాగంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచాయి. విజేతలకు చిలకలూరిపేట రోటరీ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాద్, కోశాధికారి కటకం శివరామ ప్రసాద్, చిలకలూరిపేట ప్రైవేట్ స్కూల్స్ సంఘం అధ్యక్షుడు వీరాస్వామి, డాక్టర్ సతీష్ బహుమతులను అందజేశారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ పీహెచ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. జియావుద్దీనగర్, రాహుల్‌గాంధీనగర్, షాప్ ఎంప్లాయిస్ కాలనీ, రజకుల కాలనీ, వెంకటేశ్వర కాలనీ, పోలీస్ ప్లాట్లు, ఎల్‌బీ నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయమై ప్రజలు సహకరించాలని కోరారు.

వీధివ్యాపారులకు అండగా జీఎంసీ: కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వాస్తవంగా వీధి వ్యాపారం చేసుకునే వారికి అండగా ఉంటామని, వారికి త్వరలోనే స్ట్రీట్ వెండింగ్ జోన్ల ఏర్పాటు చేస్తామని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక అమరావతి రోడ్డులోని పలు ప్రాంతాల్లో వీధి వ్యాపారులకు అనుగుణంగా స్ట్రీట్ వెండింగ్ జోన్ల ఏర్పాటుకు పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యలపై తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో కార్పొరేటర్ ఎన్.బాలాజీ, ఈఈ కోటేశ్వరరావు, ఏసీపీ రెహ్మాన్, డీఈఈ రమేష్ బాబు, ఏఎంహెచ్‌ఓ ఆనందకుమార్, ఎస్ఎస్ సోమశేఖర్, ఏఈ చైతన్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వెండింగ్ అసోసియేషన్ నాయకులు నరసింహారావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫుట్ పాత్ వెండర్లకు న్యాయం చేసిన కేంద్ర మంత్రి పెమ్మసాని

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశాలతో కార్పొరేషన్ యంత్రాంగం తక్షణమే స్పందించడంతో ఇబ్బందుల గురైన దివ్యాంగులకు న్యాయం జరిగింది. తొలగించిన ఫుట్‌పాత్ షాపులను తిరిగి ఏర్పాటు చేయించడమే గాక లైసెన్సులు కూడా ఇస్తూ జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం దగ్గరుండి వారికి సహకరించారు. నగరంలో ట్రాఫిక్ సమస్యల దృష్ట్యా వాహన రాకపోకలకు అడ్డుగా ఉన్న ఫుట్ పాత్ వ్యాపారాలను, తోపుడుబండ్లను గత కొన్ని రోజులుగా గుంటూరు కార్పొరేషన్ అధి కారులు తొలగిస్తున్నారు. ఇందులో భాగంగా అమరావతి రోడ్డులో బడ్డీ కొట్లు, ఫుట్ పాత్ వ్యాపారాలు నిర్వహించుకుంటున్న పలువురు దివ్యాంగుల వ్యాపారాలను కూడా అధి కారులు తొలగించాల్సి వచ్చింది. అయితే, తమ జీవనోపాధి దెబ్బతింటోందని వారు ఆం దోళన వ్యక్తం చేస్తూ ఈ నెల 10న కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ని గుంటూరులోని ఆయన కార్యాలయంలో కలిశారు. వ్యాపారాలు తొలగించడం వలన తామందరం రోడ్డున పడ్డామంటూ పెమ్మసానికి వినతులు సమర్పించారు. దీంతో స్పందించిన కేంద్ర మంత్రి



రోడ్డుపై వ్యాపారాలు చేస్తున్న వారితో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నేరుగా కమిషనర్ పులి శ్రీనివాసులుకి అక్కడి నుంచే ఫోన్ చేశారు. దివ్యాంగులకు ఎదురైన సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, తొలగించిన వ్యాపారాలను తిరిగి ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ సమస్యలతో పాటు నిజమైన వ్యాపారులకు నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. అనంతరం కమిషనర్‌ను సదరు దివ్యాంగులు కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించగా వారి సమస్యలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత తిరిగి ఆ వ్యాపారాలకు లైసెన్సులు ఏర్పాటు చేయిస్తూ, అమరావతి రోడ్డులోని దివ్యాంగులకు తిరిగి వ్యాపారాలు నిర్వహించుకునేలా కమిషనర్ అవకాశం కల్పించారు. ఆదివారం సదరు దివ్యాంగులు అమరావతి రోడ్డులో ఆయనే దగ్గరుండి వ్యాపారాలను ఏర్పాటు చేయించారు. దీనిపై దివ్యాంగులు స్పందిస్తూ పెమ్మసాని స్పందించడం వల్లే తమ సమస్య త్వరితగతిన పరిష్కారమైందని ఆనందం వ్యక్తం చేశారు.



కంటి వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్

ప్రజారోగ్యం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తా

గుంటూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం కోసం చిత్తశుద్ధితో పని చేస్తానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం నియోజకవర్గంలోని అంజుమన్ ఇస్లామియా స్కూల్లో నిర్వహించిన మెగా కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకర్ కంటి ఆసుపత్రితో కలిసి నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి ప్రజల కోసం మెగా కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో కంటి పరీక్షలు, వైద్యం చేయించుకునే స్తోమత లేని పేద ప్రజల కోసం వారి కళ్ళల్లో వెలుగు నింపడం కోసమే ఈ కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి కళ్ళజోళ్ళు తన సొంత ఖర్చుతో అందిస్తానని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. కంటి వైద్య శిబిరంలో 479 మంది పరీక్షలు చేయించుకున్నారని, వారిలో 120 మంది రోగులకు శుక్లాలు, వివిధ కంటి సమస్యల ఆపరేషన్ అవసరం ఉందని డాక్టర్లు నిర్ధారించారని చెప్పారు. నియోజకవర్గంలో తన ఆధ్వర్యంలో ప్రతినెలా కంటి వైద్య శిబిరాలే కాకుండా, ఇతర చికిత్సలకు సంబంధించిన వైద్య శిబిరాలు కూడా నిర్వహిస్తానని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అశోక్, సంకురి శీను, శంకర్ కంటి ఆసుపత్రి నిర్వాహకులు శ్రీనివాస రావు, డాక్టర్ చింతం, డాక్టర్ మంజూత్, నాయకులు చిన్న బుజ్జి, అంజనేయ ప్రసాద్, వంగర ఏడుకొండలు, జమీర్, అన్వర్ పాల్గొన్నారు.

శ్వాసకోశ వ్యాధులు పెరుగుతున్నాయి

గుంటూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యం, స్మోకింగ్, వాతావరణ కాలుష్యాల వల్లనే శ్వాసకోశ వ్యాధులు పెరుగుతున్నాయని పల్మనాలజిస్టు డాక్టర్ డీఎస్ఎస్ వీ శ్రీదేవి తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్యసభలో ఆమె ప్రసంగించారు. డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ ఇటీవల అత్యధికంగా పెరుగుతున్న సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. వయస్సు పెరుగుతున్న కొద్దీ శ్వాసకోశ సమస్యలు వస్తుంటాయని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండొచ్చని తెలిపారు. శ్వాసకోశ సమస్యలు ఉన్న వారు పెంపుడు జంతువులకు దూరంగా ఉంచాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవిని సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, నూరుల్ అహ్మద్, ఎమ్ కుమార్ ఉన్నారు.

సీపీఆర్ ఎలా చేయాలో తెలుసుకోవాలి

● ఆరోగ్య భారతి వైద్య నిపుణులు

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా గుండెపోటుకు గురైనప్పుడు వారికి సీపీఆర్ ఎలా అందించాలో ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలని ఆరోగ్య భారతి వైద్య నిపుణులు సూచించారు. స్థానిక అరండల్‌పేటలోని యోగి భవన్‌లో ఆదివారం ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో 'బేసిక్ లైఫ్ సపోర్టు' అనే అంశంపై ఆరోగ్య మిత్ర కార్యశాల జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు డాక్టర్ కె ఎస్ ఎన్ చారి, డాక్టర్ పి ఎస్ రావు, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ కాకాని పృథ్వీరాజు, డాక్టర్ శ్రీనివాసరెడ్డి డాక్టర్ సీతారాం కిషోర్, డాక్టర్ కల్లగంటి నాగార్జున పాల్గొని వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. పిల్లల చేత ప్రదర్శన చేసి చూపించారు, ప్రథమ చికిత్స గురించి రోగి గాయపడిన తర్వాత హాస్పిటల్‌కి చేరే లోపల ప్రాణాన్ని ఎలా కాపాడాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య జీవనశైలి ఎలా ఉండాలి, ఎలాంటి ఆహారం తీసుకోవాలి, మానసికత ఎలా ఉండాలి అనే విషయాలను వివరించారు. హోమియో వైద్యం, 12 రకాల హోమియో మందులను సాధారణ జబ్బులకు ఎలా వాడుకోవాలో తెలియజేశారు. అలానే గృహ వైద్యం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

గోరంట్ల ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డేగల ప్రభాకర్

గుంటూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా స్థానిక గోరంట్లలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం నిర్వహించిన సత్య నారాయణ వ్రత కార్యక్రమాన్ని ఏపీ పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నవరం దేవాలయం నుంచి వచ్చిన అర్చకులతో నిర్వహించిన సత్యనారాయణ వ్రతంలో సుమారు 2000 వేల మంది దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం నూతన పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆంజనేయులు, యర్రంశెట్టి వేణు, రామచంద్ర బ్రదర్స్ సుబ్బారావు, యర్రగోపు నాగేశ్వరరావు, రాగం సదాశివరావు, మేకల బాబురావు పాల్గొన్నారు.



రామ్మూర్తి నాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

నారా రామ్మూర్తినాయుడికి ఘన నివాళి

గుంటూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి సోదరుడు, మాజీ శాసనసభ్యుడు నారా రామ్మూర్తి నాయుడుకు టీడీపీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక అరండల్‌పేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్, జోన్- 5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర, ఏపీ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ డేగల ప్రభాకర్ సహా పలువురు నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రామ్మూర్తినాయుడు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గతంలో చంద్రగిరి శాసనసభ్యుడిగా ఆయన అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శులు కనపర్తి శ్రీనివాసరావు, కసుకుర్తి హనుమంతరావు, గుంటుపల్లి శేషగిరిరావు, గోళ్ళ ప్రభాకర్, కంచర్ల శివరామయ్య, పానకాల వెంకటమహాలక్ష్మి, వేములకొండ శ్రీనివాస్, తాళ్ళ వెంకటేష్ యాదవ్, బొబ్బిలి రామారావు, మేళం సైదయ్య, నారా జోషి, వేములపల్లి శ్రీరాంప్రసాద్, నేపాక పద్మావతి, యర్రగోపు నాగేశ్వరరావు, హుస్సేన్, బెల్లంకొండ సురేష్, మన్నవ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య వసతి గృహాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



నూతన ఆర్యవైశ్య వసతి గృహన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్ తదితరులు

గుంటూరు(విద్య),నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సంగడి గుంటలోని చలమయ్య సత్రంలో ఆర్యవైశ్య విద్యార్థుల కోసం నిర్మించిన నూతన వసతి గృహాన్ని ఎమ్మెల్యే నసీర్ ఆదివారం ప్రారంభించారు. రూ.120 కోట్ల వ్యయంతో నూతన వసతి గృహం నిర్మించి వారి అభి వృద్ధికి కృషి చేయడం అభినంద నీయమని అన్నారు. కార్యక్రమంలో 13వ డివిజన్ కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు, ఆర్య వైశ్య వసతి గృహం ట్రస్టీలు గుంటూరు సత్యనారాయణ, కమిటీ సభ్యులు రాంబాబు, ఎం.ప్రసాద్, అశోక్‌కుమార్,రవికుమార్, కార్పొరేటర్ బాబు పాల్గొన్నారు.

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నగర కార్యవర్గ ఎన్నిక

గుంటూరు(విద్య),నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నగర కార్యవర్గ ఎన్నిక ఆదివారం స్థానిక కొత్తపేటలోని జలగం రామారావు స్కూల్‌లో నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా ఎస్.వేణుగోపాల రావు, అధ్యక్షుడిగా పి.సాయివిశ్వనాథ్, ప్రధాన కార్యదర్శిగా పి.లలితబాబు, ఆర్థిక కార్యదర్శిగా కేవీ రాఘవులు, అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్.వెంకటేశ్వర్లు, రత్నశ్రీ, ఎ.హరగోపాల్, ఎస్.నాగరాజు, ఉపాధ్యక్షులుగా ఎ.వెంకటేశ్వరరావు, ఎన్.క్రీస్తురాజు, జీవీ అమృతలత, అదనపు ప్రధాన కార్యదర్శులుగా టి.శ్రీనివాసరావు, ఏవీ కృష్ణారావు, సీహెచ్ సత్యవాణి, కార్యదర్శులుగా కె.పూర్ణచంద్రరావు, ఎం.బాబూరావు, జిల్లా కౌన్సిలర్లుగా కె.వేణుగోపాలరావు, పి.చెంచయ్య, వై.ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. నూతన కమిటీ పరిశీలకుడిగా ఎన్‌టీఏ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌ఖలీల్ వ్యవహరించారు. నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఎన్‌టీఏ రాష్ట్ర కార్యదర్శి బి.హైమారావు, ఎన్‌జీవో నాయ కులు ఘంటసాల శ్రీనివాసరావు, సతీష్ తదితరులు అభినందించారు.

ఐక్యంగా ఉండి రాజకీయ పదవులు సాధించుకోవాలి

● ఏసీబీ విశ్రాంత డీజీ పూర్ణచంద్రరావు



ఐక్యతా మహోత్సవంలో రిటైర్డు ఏసీబీ డీజీ పూర్ణచంద్రరావు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య తదితరులు

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుమ్మర శాలివాహనులు ఐక్యంగా ఉంటే రాజకీయ పదవులు వాటంతట అవే వెతుక్కొంటూ వస్తాయని ఏసీబీ విశ్రాంత డీజీ జే.పూర్ణ చంద్రరావు అన్నారు. స్థానిక నల్లపాడు రోడ్డులోని నగర వనం సమీపంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంఘం ఐక్యత మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమాన్ని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఇందుర్తి శివన్నారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పూర్ణచంద్రరావు పాల్గొన్నారు. కుమ్మర శాలివాహనులంతా ఒక మాటపై నిలబడి కార్యక్రమాలు నిర్వహిస్తుంటే పార్టీలే వెతుక్కొంటూ వచ్చి పదవులు ఇస్తాయన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ కుమ్మర శాలివాహనులు ఎదుర్కొంటున్న మట్టి సమస్యలపై తనకు అవగాహన ఉందని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని, శాలివాహన చక్రవర్తి విగ్రహం ఏర్పాటుకు సహకరిస్తానని అన్నారు. మహోత్సవంలో అసోసియేషన్ నాయకులు భాస్కర శ్రీనివాస్, రాజవరపు ఏడుకొండలు, కల్పతరువు రవి పాల్గొన్నారు.

19న బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల మహాధర్నా

గుంటూరు(తూర్పు), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): యునైటెడ్ బ్యాంక్ రిటైర్డ్ ఫెడరేషన్, ఏపీ బ్యాంక్ రిటైర్డ్ ఫెడరేషన్ సంయుక్త పిలుపు మేరకు ఈ నెల 19న విజయవాడ అలంకార్ కూడలి వద్ద రాష్ట్ర స్థాయి మహాధర్నాను చేపట్టనున్నట్లు జిల్లా బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల కో ఆర్డినేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేవీబీ మురళీ కృష్ణారావు తెలిపారు. స్థానిక బ్రాడీపేట బ్యాంకు ఉద్యోగుల భవనం (బ్యాంకర్స్ క్లబ్)లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. సుదీర్ఘ కాలంగా ఉన్న పెన్షన్ విధానాన్ని పునఃసమీక్షించాలని, మెడికల్ ఇన్సూరెన్స్‌లో చెల్లిస్తున్న ప్రీమియంను తగ్గించాలని డిమాండ్ చేశారు. పెన్షన్‌దారులు తీసుకున్న రుణాలను 10 సంవత్సరాలలోపు చెల్లించినా, కోర్టుల ఆదేశాలను పక్కనబెట్టి 15 సంవత్సరాల వరకు రికవరీ చేయటం వెంటనే ఆపేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ధర్నాలో ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయ కులు కే.హరిబాబు, వై.కోటేశ్వరరావు, ఎస్ఆర్ఎస్ శ్యామ్, వై.హనుమంతరావు, ఎంపీ పుల్లయ్య, ఏ.వెంకయ్య, పి.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడండి

● ఎమ్మెల్యే గళ్లా మాధవి విజ్ఞప్తి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల బెడద నుంచి ప్రజలను విముక్తి చేయాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి శాసన సభలో విజ్ఞప్తి చేశారు. శాసనసభలో శనివారం ఆమె రాష్ట్ర ప్రజలను వెంటాడుతున్న వీధి కుక్కల సమస్యపై తన గళాన్ని వినిపించారు. రాష్ట్రంలో వీధి కుక్కల సమస్య అధికంగా ఉందని, ఈ సమస్య ప్రజలను సుదీర్ఘకాలంగా వెంటాడు తోందని అన్నారు. ఎంతోమందికి ప్రాణహాని తలపెడుతున్న ఈ సమస్యపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి చోట వీధి కుక్కలు గుంపులుగా సంచ రిస్తూ ప్రజలను గాయపరుస్తున్నాయని, ఈ కుక్కల దాడిలో అనేకమంది చిన్నా రులు చనిపోయిన ఘటనలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజు వేకువజామున పనుల్లోకి వెళ్ళే పారిశుధ్య కార్మికులు మొదలు, అర్ధరాత్రి సమ యాల్లో పనుల్లోకి వెళ్ళే వారికి వీధి కుక్కలు సవాలు విసురుతున్నాయని అన్నారు. స్థానిక ప్రజలు, జంతు సంరక్షణ ప్రతినిధులు, పంచాయతీ, మున్సిపల్, కార్పొరేషన్ అధికారుల భాగస్వామ్యంతో ఒక నిర్ణయం తీసుకుని ఈ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

వైన్ షాపు వద్దంటూ ఆందోళన

గుంటూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గుడి, బడికి, నివాసప్రాంతాలకు దూరంగా వైన్ షాపును ఏర్పాటు చేసుకోవాలంటూ నందివెలుగు రోడ్డులో ఏర్పాటు చేసిన వైన్ షాపును తొలగించాలని స్థానిక పద్మనగర్, పరిసర ప్రాంత ప్రజలు ఆదివారం ఆందోళనకు దిగారు. దేవాలయాలు, ప్రభుత్వ గురుకుల వసతి గృహం, లేడీస్ హాస్టల్స్ ఉన్న ప్రాంతాల్లో ఈ వైన్ షాపును ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమని నిబంధనలకు విరుద్ధమంటూ నిరసన తెలిపారు. ఈ నూతన వైన్ షాపు వలన రానున్న రోజుల్లో అనేక ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని, అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకుని వైన్ షాపును వేరే ప్రాంతానికి తరలించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

శ్రీనివాసరావుపేటలో ఒకే రోజు మూడు వాహనాల చోరీ

● లబోదిబోమంటోన్న బాధితులు

గుంటూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాసరావుపేటలో ద్విచక్రవాహనాల దొంగలు శనివారం రాత్రి హల్‌చల్ చేశారు. ఒకే రోజు మూడు ద్విచక్రవాహనాలు దొంగిలించడంతో ఆ ప్రాంతంలో కలకలం రేకెత్తిస్తోంది. శనివారం అర్ధరాత్రి శ్రీనివాసరావు పేట అచ్చయ్యడాబా సెంటర్‌లో షాపు ముందు ఉంచిన హోండా యాక్టివాను, దొంగిలించుకుపోయారు. దీంతో కలిపి మొత్తం మూడు ద్విచక్రహనాలు చోరీకి గురవడం స్థానికుల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయి. ఆరో లైనులో ఒకటి, ఏడో లైనులో మరో యాక్సెస్ వాహనం, 8వ లైనులో మరో ద్విచక్రవాహనాన్ని దొంగిలించుకు పోయారు. నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. గతంలోనూ అనేక మంది ఇళ్ళలో ద్విచక్రవాహనాలు పెట్టుకోలేనివారు తమ ఇంటి ముందు వాహనాలను ఉంచుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్ సక్రమంగా లేకపోవడం, బీట్ పోలీసుల నిర్లక్ష్యం వెరసి ఈ కాలనీలో దొంగలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు.

ఫుట్ బాల్ క్రీడాకారిణికి ప్రోత్సాహకం



క్రీడాకారిణికి ప్రోత్సాహకం అందిస్తున్న తాళ్ల వెంకటేశ్ యాదవ్

గుంటూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ గుంటూరు జిల్లా నాయకుడు తాళ్ల వెంకటేష్ యాదవ్ ఫుట్‌బాల్ క్రీడాకారిణికి ప్రోత్సా హకం అందించారు. ఇటీవల ఫుట్ బాల్ టీమ్‌కి ఎంపికైన ఉప్పలపాడుకి చెందిన పదో తరగతి విద్యార్థిని తాడిబోయిన శ్రీలక్ష్మికి ఆయన గుంటూరులోని తన కార్యాలయంలో రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. శ్రీలక్ష్మి మరెన్నో టోర్నమెంట్లలో పాల్గొని క్రీడలు, చదువులలో మరింత రాణించాలని కోరారు. కార్యక్రమంలో అత్తలూరు పవన్, బైరి కళ్యాణ్, జింకా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేయాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని గుంటూరు రూరల్ మండల ఎంపీపీ ఇంటూరి పద్మావతి అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ మండలంలో దాదాపు 780 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయని, వాటిలో 600 గ్రూపులు నల్లపాడు శాఖలో ఉన్నాయని అక్కడ రుణాలు నిలిపివేయడంతో పొదుపు మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించి మహిళలకు రుణాలు అందేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావ పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించండి

● ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా

గుంటూరు(తూర్పు), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలును తక్షణమే చెల్లించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా అన్నారు. మెడికల్ కళాశాల ఆవరణలోని సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండేళ్ల నుంచి బకాయిలు చెల్లించకపోవడంతో విశ్రాంత ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, విశ్రాంత ఉద్యోగులకు, ప్రభుత్వ ఉద్యోగులకు నగదు రహిత చికిత్సలను అందజేయాలని చాంద్ బాషా కోరారు. ప్రతి ఉద్యోగి వద్ద నెలకు రూ 220 నుంచి రూ.330 వరకు ఈహెచ్‌సీ కింద వసూలు చేస్తున్నారని, కానీ ఈ విధానాన్ని అమలు చేయడం లేదన్నారు. ఆస్పత్రుల యాజమాన్యంతో చర్చించి నగదు రహిత చికిత్సలను అందించేలా కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు ఈ కేశవరెడ్డి, సీహెచ్ ముత్తయ్య, హనుమంత రావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ది గుంటూరు పట్టణ విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

గుంటూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ది గుంటూరు పట్టణ విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. సంఘం గౌరవాధ్యక్షుడు శంభాన వీరభద్రాచారి, మాజీ అధ్యక్షుడు కసుకుర్తి కృష్ణ సమక్షంలో ఆదివారం స్థానిక పట్నంబజార్‌లోని బండ్లజారులో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవం చేశారు. నూతన కార్యవర్గం మూడేళ్ళ పాటు వ్యవహరించనుంది. సంఘం నూతన అధ్యక్షుడుగా అధ్యక్షుడు తాడికొండ రవి, కార్యదర్శి లావేటి సాయి, కోశాధికారి వేముల సూరిబాబుతో పాటు మొత్తం 9 మంది సభ్యులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం కార్యదర్శి తిరువళ్ళూరు వెంకటరమణ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం సంఘం నూతన కార్యవర్గం కృషి చేయాలని సూచించారు.

బీజేపీ సభ్యత్వంపై ప్రజల ఆసక్తి

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ సభ్యత్వాల కోసం ప్రజలు పెద్దసంఖ్యలో ఆసక్తి చూపుతున్నారని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాండురంగ విఠల్ అన్నారు. బీజేపీ గుంటూరు రూరల్ మండలం అధ్యక్షుడు కంచర్ల రాజేష్ అధ్యక్షతన స్థానిక బ్రాడీపేటలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం వర్క్‌షాప్ జరిగింది. బీజేపీ సాధారణ, క్రియాశీల సభ్యత్వాలు జరుగుతున్న విధానంపై రాబోయే కాలంలో రూరల్ మండల అధ్యక్షుడి ఎన్నిక కోసం వర్క్ షాప్‌లో చర్చించారు.

కార్తీక వన సమారాధన

గుంటూరు(విద్య),నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏటీ అగ్రహారంలోని సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో బ్రాహ్మణ ఉద్యోగ,ఉపాధ్యాయ సంక్షేమ సేవా సమితి ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. సమితి చేసే కార్యక్రమాలకు అందరూ సంఘటితంగా పని చేయాలని సమతి అధ్యక్షులు జె.పార్థసారథి విజ్ఞప్తి చేశారు. త్వరలో జరిగే కార్తీక దీపోత్సవం కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు.

విజేతలకు బహుమతి ప్రదానం

గుంటూరు(విద్య), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్స వాలు సందర్భంగా స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయం విద్యార్థులకు ఆదివారం మ్యూజికల్ చైర్స్, డ్యాన్స్ వంటి వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు వ్యాపార వేత్తలు డి. కృష్ణమూర్తి , సి.హెచ్ సురేందర్ రెడ్డి, యమ్. విశాల్ కుమార్ తదితరులు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారులు బి. శకుంతల, పి. సత్య శిరీష, పి.కోటేశ్వరి, పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అవోపా ఆధ్వర్యంలో పేదలకు పెన్షన్లు పంపిణీ

గుంటూరు(విద్య),నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేటలోని కార్యాలయంలో ఆర్యవైశ్య ఆఫీషియల్స్‌ప్రొఫెషనల్స్(అవోపా) ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్ మంచుకొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతినెల 108 మంది పేదలకు ప్రతినెల రూ. 500 పెన్షన్‌తోపాటు నిత్యావసర వస్తువులు, మందులు అందించడం అభినందనీయమని తెలిపారు.



పుస్తకావిష్కరణలో పాల్గొన్న చలపతిరావు, సత్యనారాయణ, కృష్ణేశ్వరరావు, బాలచందర్, రామలక్ష్మి తదితరులు

'స్త్రీల పాటలు' పుస్తకావిష్కరణ

గుంటూరు(తూర్పు), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ స్వామి కళావేదికపై అజో-విభో కందాళం ఫౌండేషన్ , సంస్కృతి సంగీత నృత్య, నాటక, సాహిత్య సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నందిరాజు చలపతిరావు రచించిన 'స్త్రీల పాటలు' పుస్తకావిష్కరణ సభ ఆదివారం నిర్వహించారు. సభకు ప్రముఖ రంగస్థల సినీ నటుడు, రచయిత, దర్శకుడు వైఎస్ కృష్ణేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి, ప్రముఖ సంగీత విద్వాంసురాలు వేమూరి రామలక్ష్మి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్త్రీల పాటలను పుస్తక రూపంలో పొందుపరచడం అభినందనీయమని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. విశిష్ట అతిథిగా ఆకాశ వాణి విశ్రాంత సంచాలకురాలు ముంజులూరి కృష్ణకుమారి గ్రంథ పరిచయం చేశారు. సభలో ద్రవిడ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తోట వెంకటస్వామి, అజో-విభో కందాళం ఫౌండేషన్ ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, సంస్కృతి నిర్వాహకులు స్వరాజు బాలచందర్‌లు రచయితను ఘనంగా సత్కరించారు.

తెగల మధ్య తగవులు తగవు

● 'మణిపూర్ నగ్న కవాతు' ఆవిష్కరణలో సాహితీవేత్త రజా హుస్సేన్

గుంటూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మణిపూర్‌లో తెగల మధ్య తగవులు తగవని ప్రముఖ సాహితీవేత్త అబ్దుల్ రజా హుస్సేన్ తెలిపారు. అమరావతి సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేటలోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. సమావేశానికి అమరావతి సాహితీ మిత్రులు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు అధ్యక్షత వహించారు. రజా హుస్సేన్ సంకలనం చేసిన 'మణిపూర్ నగ్న కవాతు' కవితల గ్రంథాన్ని ప్రముఖ భాషా సేవకులు పారా అశోక్ కుమార్ ఆవిష్కరించారు. అనం తరం రజా హుస్సేన్ మాట్లాడుతూ మణిపూర్‌లో దారుణకాండ జరుగుతోందని, ప్రభు త్వాలు చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. మణిపూర్‌లో శాంతిభద్రతలు నెల కొనేలా కృషి జరగాలని అన్ని వర్గాలకు ఆయన హితవు పలికారు. మణిపూర్ బాధలను గురించి కవితలు పంపిన కవులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'ఈ మాసం కవి'గా సారస్వత ప్రేమికులు పూసపాటి కృష్ణ సూర్యకుమార్ పాల్గొని ఆయన రాసిన బంధ కవిత్వాన్ని వినిపించారు. 'చిలుక శతకం'లోని అనేక పేరడీ పద్యాలను వినిపించి సభను అలరింపచేశారు. వివిధ సామాజిక సమస్యలపై పలు మినీ కవితలు కూడా వినిపించారు. పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన 'నిక్కచ్చి కవితకోసం కవితా పఠన కార్యక్రమంలో 'గుంటూరు' అనే అంశంపై గడల శివప్రసాద్, రేపల్లె రాజ్ కృష్ణ, చల్లా సత్యవతి (పిడుగురాళ్ల), మేడిశెట్టి సుభద్రా కృష్ణ, దాకోజు శివకుమార్, గోలి మధు (మంగళగిరి), మైలవరపు లలితకుమారి, మన్నం వెంకటగురువు మొదలైన వారు కవితలు వినిపించారు. కవితల సంకలనకర్త అబ్దుల్ రజా హుస్సేన్‌ను, 'ఈ మాసం కవి' పూసపాటి కృష్ణ సూర్య కుమార్‌ను, 'నిక్కచ్చి కవిత'గా ఎంపికైన మేడిశెట్టి సుభద్రా కృష్ణను సంస్థ పక్షాన డాక్టర్ రావి రంగారావు, పారా అశోక్ కుమార్, డాక్టర్ సేవా కుమార్ ఘనంగా సత్కరించారు. శాంతశ్రీ ట్రస్ట్ వారు 'నిక్కచ్చి కవిత' సత్కార గ్రహీతకు రూ. 500 నగదు బహుమతి అందజేశారు.

కార్గిల్ యుద్ధ వీరులకు ఘన నివాళి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 25వ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా యుద్ధ వీరులకు సైనికోద్యోగులు ఘనంగా నివాళులర్పించారు. మద్రాసు ఇంజనీరింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం నుంచి బ్రిగేడియర్ వీ వెంకట రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. మెగా బైక్ ర్యాలీ నగరంలోని ప్రధాన వీధుల్లో నిర్వహించారు. అనంతరం మాజీ సైనికుల సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్య క్రమంలో సీనియర్ ఆఫీ సర్ సుబేదార్ రమేష్, నాయక్ గోవిందా రాజులు, జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది, మాజీ సైనికుల సంఘం ప్రతినిధులు రామిరెడ్డి, నరసింహం, సుభాన్, మాజీ సైనికులు, పింఛనర్లు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం

సోమవారం ● 18 నవంబరు 2024



హాట్ హిట్స్

ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. భూల్ భులాయా (భూల్ భులాయా3)
3. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
4. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
5. జా రాంఝున్ (దో పత్తీ)
6. ఆయీ నై (స్త్రీ-2)
7. సాజ్‌నీ రే (లా పతా లేడీస్)
8. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
9. అపనా బనాలే (భేడియా)
10. మిలియనీర్ (గ్లోరీ)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

సెలబ్ టాక్

దేనికైనా రెడీ..!

**బాలీవుడ్‌లోకి మరో వారసురాలు వచ్చింది.
ఆమె ఎవరో కాదు... హీరో వరుణ్ ధావన్ అన్న కూతురు...
'బిన్నీ అండ్ ఫ్యామిలీ' కథానాయిక... అంజినీ ధావన్.
వెండితెరపై వెలిగిపోవాలన్న ఆశయంతో... కొన్నేళ్లు
పరిశ్రమలోనే పని చేసి... అనుభవం గడించింది.
తొలి చిత్రంతోనే మంచి హిట్ సొంతం చేసుకోవడమే కాదు...
అగ్ర నటుల ప్రశంసలు కూడా అందుకుంది.**



అంజినీ ఇంట్లో అందరూ సినీ పరిశ్రమతో అనుబంధం ఉన్నవారే. తాతయ్య అనిల్ ధావన్ వెటరన్ నటుడు. ఆయన కుమారుడు, అంజినీ తండ్రి సిద్ధార్థ్ ధావన్ బుల్లితెర నటుడు. హిట్ చిత్రాల దర్శకుడు డేవిడ్ ధావన్ పినతాత. డేవిడ్ తనయుడు, ప్రముఖ హీరో వరుణ్ ధావన్ ఆమెకు వరుసకు బాబాయి. చిన్నప్పటి నుంచీ సినీ వాతావరణంలోనే గడిపిన అంజినీకి సాధారణంగానే నటనపై మక్కువ పెరుగుతూ వచ్చింది. ముంబయిలో పుట్టి పెరిగిన ఆమె... డిగ్రీ తరువాత కెరీర్‌పై పూర్తి శ్రద్ధ పెట్టింది. అయితే కుటుంబ నేపథ్యం, ఇంట్లోవాళ్ల ప్రోత్సాహం ఉన్నా... తొలుత తనను తాను పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకోవాలని అనుకుంది. ఆ తరువాతే తెర మీద కనిపించాలనే పట్టుదలతో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పరిశ్రమలో అడుగుపెట్టింది. వరుణ్ ధావన్ 'కూలీ నంబర్-1'కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసింది. అప్పుడప్పుడూ బామ్మ రష్మీ ధావన్ యాక్టింగ్ స్కూల్లోని విద్యార్థులతో కలిసి నటనలో మెళకువలు కూడా నేర్చుకుంది. ఇలా ఎక్కడ అవకాశం దొరికినా దాన్ని ఉపయోగించుకొంటూ... తనలోని నటికి మరిన్ని వన్నెలద్దింది. వీటన్నిటి ఫలితం తొలి చిత్రం 'బిన్నీ అండ్ ఫ్యామిలీ'లోనే కనిపించింది. సినిమా చూసినవారందరూ... ఆమెకు అది మొదటి సినిమా అనుకోలేదట. అంతలా అదరగొట్టింది నటనలో. ఇక ఎంతో సహజంగా నటించిందనేది విమర్శకుల మాట.

▸▸ వేరొక ఆడిషన్‌లో చూసి...

'బిన్నీ అండ్ ఫ్యామిలీ'లో అవకాశం కూడా విచిత్రంగా వచ్చింది అంజినీకి. "వేరొక సినిమా కోసం ఏడాదిగా ఆడిషన్లు ఇస్తున్నా. అది సంజయ్ త్రిపాఠీ దృష్టిలో పడింది. తను తీయబోయే చిత్రంలో 'బిన్నీ' పాత్రకు నేనైతే సరిగ్గా సరిపోతానని ఆయన భావించారట. వెంటనే నన్ను ఆడిషన్స్‌కు పిలిచారు. నా నటన నచ్చింది. అలా 'బిన్నీ అండ్ ఫ్యామిలీ'లో అవకాశం రావడమే కాదు... నటిగా నా కెరీర్ కూడా ప్రారంభమైంది" అంటూ ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించింది అంజినీ.



▸▸ 'నా జీవితానికి దగ్గరైన పాత్ర'...

ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలను లండన్‌లో చిత్రీకరించాడు సంజయ్. నెల రోజులపాటు సాగిన ఆ షెడ్యూల్‌లో 'పంకజ్ కపూర్, హిమని శివ్‌పురి, రాజేష్‌కుమార్ లాంటి సీనియర్లతో కలిసి పని చేయడంవల్ల ఎంతో నేర్చుకొనే అవకాశం లభించింది. అంతా ఒక కుటుంబ సభ్యుల్లా కలిసిపోయారు. నెల రోజులూ ఎంతో సరదాగా గడిచిపోయాయి. అదీకాకుండా 'బిన్నీ' పాత్ర నిజ జీవితంలో నాకు చాలా దగ్గరగా ఉంటుంది. కొన్ని సన్నివేశాలు చేస్తున్నప్పుడు, ముఖ్యంగా బామ్మ పాత్రధారి నా చిరిగినట్లుండే ఫ్యాషన్ జీన్స్ చూసి ఇదేంటని ప్రశ్నించినప్పుడు మా నాన్న గుర్తుకువచ్చారు. ఆయన కూడా ఇంట్లో నా డ్రెస్‌లు చూసి జోకులు వేసేవారు' అంటూ తన అనుభవాలు పంచుకుంది అంజినీ. డేవిడ్, వరుణ్ ధావన్ ఎప్పుడూ ఆమెకు అండగా ఉంటారు. ముఖ్యంగా ఈ చిత్రం ప్రచార కార్యక్రమాల్లోనే కాకుండా, షూటింగ్ సమయంలో కూడా వరుణ్ అంజినీకి మద్దతుగా నిలిచాడు. తన ఇన్‌స్టా, ఎక్స్ ఖాతాల్లో ఆమె గురించి, ఆమె చిత్రం గురించిన విశేషాలను పంచుకున్నాడు. సినిమా విడుదల తరువాత కూడా అంజినీని ప్రత్యేకంగా అభినందించాడు.

▸▸ నిరూపించుకొంటేనే...

"నా సినిమా విడుదలకు ముందు కొందరు 'బాలీవుడ్‌లో బంధుప్రీతికి మరో నిదర్శనం' అంటూ కించపరిచేలా నాపై వ్యాఖ్యలు చేశారు. పరిశ్రమలో పరిచయాలవల్ల కష్టపడకుండానే మొదట్లో ఒకటి రెండు అవకాశాలు వస్తాయేమో! కానీ మనలో సామర్థ్యం లేకపోతే ఇక్కడే కాదు, ఏ రంగంలోనూ నిలదొక్కుకోలేము. మనల్ని మనం నిరూపించుకొంటేనే మనుగడ. నటిగా తెరమీద కనిపించడానికి ముందు సినీ నిర్మాణంలో ప్రతి క్రాఫ్ట్ గురించీ తెలుసుకోవాలని అనుకున్నాను. అందుకే తొలుత బాబాయి సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాను. షూటింగ్ స్పాట్‌కు ఉదయాన్నే వెళ్లిపోయేదాన్ని. కెమెరా, లైటింగ్, లొకేషన్లు... ఇలా అన్నిటి మీద ఒక అవగాహన వచ్చాకనే నటన గురించి ఆలోచించాను" అంటుంది అంజినీ.

మంచి స్నేహితులు...

'కూలీ నంబర్-1' షూటింగ్‌లో వరుణ్, ఆ చిత్ర కథానాయిక సారా అలీఖాన్‌తో ఎంతో సరదాగా గడిచిపోయేదని, తారలపై వచ్చే గాసిప్స్ మీద మాట్లాడుకొని నవ్వుకొనేవారమని చెప్పింది ఇరవై నాలుగేళ్ల అంజినీ. 'వరుణ్‌ను ఎప్పుడూ బాబాయిగా చూడలేదు. అన్నయ్యలాగా భావిస్తాను. తను నన్ను ఎంతో గారాబంగా చూసుకొంటాడు' అంటున్న అంజినీకి సంజయ్ కపూర్ కుమార్తె, నటి షనయ కపూర్, బోనీ- శ్రీదేవిల చిన్న కూతురు ఖుషీ కపూర్ మంచి మిత్రులు. 'నా సినిమా ప్రివ్యూ నుంచి బయటకు వచ్చేటప్పుడు వాళ్ల కళ్లు చమర్చాయి. నా నటన బాగుందని అభినందించారు' అంటూ తన ఆనందాన్ని పంచుకుంది అంజినీ.

అన్నీ చెయ్యాలి...

మొదటి చిత్రంతోనే మంచి నటిగా ప్రశంసలు అందుకున్న అంజినీ... భవిష్యత్తులో అన్ని రకాల పాత్రలూ చేయాలని అనుకొంటోంది. 'యాక్షన్, కామెడీ, ప్రేమ కథలు, స్పై థ్రిల్లర్లు అనే తేడా లేకుండా ప్రతి పాత్రా పోషించాలి. విలక్షణ నటిగా ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలి'... అని కోరుకొంటున్న అంజినీ ఏ పాత్రకైనా రెడీ అంటోంది. ఆమెకు ఇన్‌స్టాలో ఫాలోవర్స్ కూడా తక్కువేంలేరు. ఫ్యాషన్ ఐకాన్‌గా తెరంగేట్రానికి ముందే లక్షలమంది అభిమానులను సంపాదించుకున్న ఆమె... తరచూ వెరైటీ డ్రెస్సుల్లో ఫొటోలు అప్‌లోడ్ చేస్తుంటుంది. వాటికి లైక్‌లూ లక్షల్లోనే. ఫిట్‌గా ఉండటానికి యోగా, జిమ్నాస్టిక్స్‌ను తన దినచర్యల్లో భాగంగా చేసుకుంది.

నవ్య | చిత్రజ్యోతి

ఆ స్వేచ్ఛ మాకూ ఉంది

- విష్వక్‌సేన్

'ఒక సినిమా బాగోగుల గురించి విమర్శకులు, సమీక్షకులు ఎంతటి విశ్లేషణ అయినా చేయవచ్చు కానీ ఆ వంకతో వ్యక్తిత్వ హననానికి పాల్పడేలా ఉండకూడదు. మీలాగా మాకూ భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుందని గుర్తుంచుకోవాలి' అని హీరో విష్వక్‌సేన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'మెకానిక్ రాకీ'. మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ కథా



నాయికలు. రామ్ తాళ్లూరి నిర్మాత. ఈ నెల 22న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం వరంగల్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. విష్వక్‌సేన్ మాట్లాడుతూ "మెకానిక్ రాకీతో మా నిర్మాత రామ్ గర్వపడేలా చేస్తా. పది సినిమాల అనుభవంతో చెబుతున్నా మంచి సినిమా తీశాం. ఐదు నిమిషాలు కూడా బోర్‌కొట్టదు. మా సినిమాను ఆదరించండి' అని ప్రేక్షకులను కోరారు. రామ్ తాళ్లూరి మాట్లాడుతూ 'విష్వక్‌సేన్ కష్టపడి, ఇష్టపడి చేసిన సినిమా ఇది. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలున్నాయి. మీ అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. యువతను, మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలతో తెరకెక్కిన చిత్రమిదని మీనాక్షి చౌదరి తెలిపారు. సందేశం, వినోదం కలబోతగా రూపొందిన చిత్రమిదని శ్రద్ధా శ్రీనాథ్ చెప్పారు.

కొత్తగా...

రిమాండ్‌కు కస్తూరి



తమిళ నాడులో నివసిస్తున్న తెలుగు వారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో నటి కస్తూరికి ఎగ్మోర్ మెట్రోపాలిటన్ కోర్టు 12 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆమెను పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. 'అధికార దుర్వినియోగాన్ని ముగింపు పలికి న్యాయాన్ని గెలిపించాల'ని కోర్టు వెలుపల కస్తూరి మీడియాతో అన్నారు. మధురై కోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించడంతో హైదరాబాద్‌లో తలదాచుకున్న కస్తూరిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకొని తమిళనాడుకు తరలించిన విషయం తెలిసిందే.



పట్నాలో పుష్ప రూల్

'నేను మొదటిసారి బిహార్‌కు వచ్చాను. నా హిందీ అంత బావుండదు. తప్పులు మాట్లాడితే క్షమించండి. ఎవరికీ తలవంచని పుష్ప నేడు మీ ముందు తలవంచుతున్నాడు. మీ అభిమానమే 'పుష్ప 2: ది రూల్' లాంటి మంచి చిత్రాన్ని తీయడానికి మాకు ప్రేరణ' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన హీరోగా సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పుష్ప 2'. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని బిహార్ రాజధాని పట్నాలో భారీ జనసందోహం మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ "పుష్ప' చిత్రాన్ని పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఆ సినిమా సూపర్‌హిట్ అయ్యిందంటే ఆ గొప్పదనం నాది కాదు, ప్రేక్షకులదే. మీ ప్రేమే 'పుష్ప 2: ది రూల్' చిత్రాన్ని ఇంత గొప్పగా తీయడానికి కారణమైంది. డిసెంబర్ 5న మీ ముందుకు రాబోతోంది. తప్పకుండా మీ అందరినీ అలరిస్తుంది. మీ సమక్షంలో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను' అని చెప్పారు. రష్మిక మందన్న మాట్లాడుతూ 'ఇంతమంది అభిమానులు 'పుష్ప' ప్రపంచంలోకి వచ్చినందుకు నాకు సంతోషంగా ఉంది. రెండు సంవత్సరాలుగా అభిమానులు ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నారు. మీ అందరి అంచనాలకు మించి సినిమా ఉండబోతోంది' అని తెలిపారు. 'పట్నా ప్రజల నుంచి ఈ స్థాయి ఆదరణను ఊహించలేదు. ఈ గొప్పదనం అల్లు అర్జున్, సుకుమార్‌కు దక్కుతుంది' అని నిర్మాత యలమంచిలి రవి, నవీన్ యెర్నేని తెలిపారు. 'పుష్ప 2' చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం భారీ ఎన్నికల ప్రచార సభను తలపించింది. దేశవ్యాప్తంగా ఉన్న అల్లు అర్జున్ అభిమానులు తరలివచ్చారు. గాంధీ మైదానం జనాలతో కిటకిటలాడిపోయింది. ఈ కార్యక్రమానికి సుమారు రెండు లక్షలమంది హాజరయ్యారని అంచనా. "పుష్ప అంటే ఫైర్ కాదు వైల్డ్ ఫైర్' అంటూ ఆయన చెప్పిన డైలాగ్‌లకు అభిమానుల కేరింతలతో సభాప్రాంగణం మార్మోగింది. బిహార్ డిప్యూటీ సీఎం విజయ్ సేన సాహెబ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పశుపాలకుడిగా ప్రణవ్



వెండితెరపైన సాదా సీదా పాత్రలను అద్భుతంగా పోషించే తారలు నిజ జీవితంలో అలా జీవించగలరా? అంటే 'కష్టమే' అని చెప్పాలి. కానీ మలయాళ మెగా స్టార్ మోహన్‌లాల్ కొడుకు ప్రణవ్ మాత్రం స్టార్‌డమ్‌ను పక్కన పెట్టి దేశం కాని దేశంలో అనామకంగా జీవిస్తున్నాడు. ప్రస్తుతం స్పెయిన్‌లో 'వర్క్ అవే' అనే కార్యక్రమంలో భాగంగా ఆయన ఓ పొలంలో కష్టపడి పనిచేస్తున్నారు. పశుపాలకుడిగా గొర్రెలు, మేకలు, గుర్రాలను కాస్తున్నారు ప్రణవ్. నటుడిగా పోషించాల్సిన విభిన్న పాత్రల్ని తన కొడుకు నిజజీవితంలో పోషిస్తున్నారని ప్రణవ్ తల్లి సుచిత్ర ఓ ఇంటర్వ్యూలో చెప్పడంతో ఈ విషయం అందరికీ తెలిసింది. ఒక సూపర్‌స్టార్‌కి కొడుకు, ఆగర్భ శ్రీమంతుడు అయినా విలాసవంతమైన జీవన శైలిని వదిలి ఇలా సాదాసీదాగా గడుపుతున్న ప్రణవ్‌ను నెటిజన్లు అభినందిస్తున్నారు. 2002లో 'ఒన్నమన్' అనే సినిమాతో బాలనటుడిగా అరంగేట్రం చేసిన ప్రణవ్.. 'పునర్జనీ' చిత్రంతో ఉత్తమ బాలనటుడిగా కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డు అందుకున్నారు. 2018లో జీతూ జోసెఫ్ దర్శకత్వంలో 'ఆది' అనే చిత్రంతో హీరోగా పరిచయమయ్యారు. ఈ సినిమా ఆ ఏడాది అత్యధిక వసూళ్లు అందుకున్న చిత్రంగా నిలవడమే కాకుండా ప్రణవ్‌కు ఉత్తమ నటుడిగా సైమా అవార్డునూ తెచ్చిపెట్టింది. ప్రణవ్ కేవలం నటుడిగానే కాకుండా ప్లేబ్యాక్ సింగర్‌గా, పాటల రచయితగానూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు.

గాయకుడు అనురాగ్ కులకర్ణి, గాయని రమ్య బెహర వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఈ వేడుకకి సంబంధించిన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరలవుతున్నాయి. కొద్దిమంది కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్.కీరవాణి చిన్న కుమారుడు శ్రీ సింహా, సీనియర్ నటుడు మురళీ మోహన్ మనవరాలు రాగ వివాహం త్వరలోనే జరగనుంది. ఆదివారం గోల్కొండ రిసార్ట్స్‌లో ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ వేడుకలో ఆంధ్రజ్యోతి గ్రూప్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సహా పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు.



రూ. పదికోట్ల వీడియో ఫ్రీగా చూడండి



నటి నయనతార బయోపిక్‌గా నెట్‌ఫ్లిక్స్ తెరకెక్కించిన డాక్యుమెంటరీ 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్'. దీనికోసం 'నానుమ్ రౌడీ దాన్' సినిమా సమయంలో షూట్ చేసిన మూడు సెకన్ల క్లిప్‌ను వాడుకున్నందుకు రూ.పది కోట్లు ఇవ్వాలని నటుడు, నిర్మాత ధనుష్ కోరారని.. ఇందుకు ఆయనని విమర్శిస్తూ నయనతార ఓ బహిరంగ లేఖ రాసిన సంగతి తెలిసిందే. అయితే నయనతారను సపోర్ట్ చేస్తూ ఆదివారం ఆమె భర్త విఘ్నేష్ శివన్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రెండు పోస్టులు పెట్టారు. అందులో ఒక దాంట్లో.."కేవలం మూడు సెకన్లకు ధనుశ్ రూ.పది కోట్లు డిమాండ్ చేసిన వీడియో ఇదే. మీరంతా ఫ్రీగా చూసేయ్యండి" అని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు. అంతటితో ఆగకుండా... మరో పోస్ట్‌లో.. 2017లో 'నక్క పొడు పొడు రాజా' సినిమా ఆడియో ఫంక్షన్‌లో ధనుశ్ మాట్లాడిన వీడియోను కూడా షేర్ చేశారు. అందులో ప్రేమను పంచడం గురించి.. నటీనటులు పనిచేసే చోట ఉండాల్సిన వాతావరణం గురించి ధనుశ్ మాట్లాడారు. ఆ వీడియోకి కౌంటర్‌గా "జీవించండి.. ఇతరులని స్వేచ్ఛగా జీవించనివ్వండి. ప్రేమను పంచండి.. ఓం నమః శివాయ. మీరు చెప్పినవి ముందు మీరు పాటించండి. కనీసం మీ అభిమానుల కోసమైనా" అని పేర్కొన్నారు. అయితే ఈ పోస్టులను కొద్దిసేపటికే విఘ్నేష్ శివన్ తొలగించడం గమనార్హం. మరోవైపు గాయని సుచిత్ర, ధనుశ్ ఎంతో మంది హీరోయిన్లను వేధించారని ఆరోపించారు.

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

దుగ్గిరాల, నవంబరు 17: మండల గ్రామం పెనుమూలి గ్రామానికి చెందిన గగ్గా నాగదుర్గను కాన్పు నిమిత్తం 108లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రసవించింది. ఈఎంటీ జీ.అనంద్, ఆశా కార్యకర్త ఫాతిమా కాన్పు చేసి పుట్టిన మగబిడ్డను తల్లికి అప్పగించారు.

నేడు ఉండవల్లి శ్రీదేవి

ప్రమాణ స్వీకారం

తాడేపల్లి టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాదిగ వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి తాడేపల్లిలోని ఎస్సీ కార్పొరేషన్ ఛాంబర్‌లో సోమవారం ఉదయం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఉదయం 9 గంటలకు ఆమె నివాసం నుంచి భారీ ర్యాలీతో బయలుదేరి, అనంతరం ఎస్సీ కార్పొరేషన్‌లో ప్రమాణ స్వీకారం చేస్తారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

మంగళగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు వివాదాలకు దూరంగా వుండి సత్ప్రవర్తనతో మెలగాలని మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ సూచించారు. మంగళగిరి రూరల్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం మండల పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంటుందని, అనవసరమైన విషయాల్లో తలదూర్చినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలగకుండా క్రమశిక్షణతో మెలగాలని సూచించారు.

వైసీపీ సేవాదళ్ అధ్యక్షుడు

బెజ్జం రాజీనామా

తాడికొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ తాడికొండ మండల సేవాదళ్ అధ్యక్ష పదవికి తాడికొండ శివారు బడేపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బెజ్జం సాయి ప్రసాద్ రాజీనామా చేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య కారణాలతో పార్టీ పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలిపారు. పార్టీలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

పేదలను పట్టించుకోని

కూటమి ప్రభుత్వం

మంగళగిరి సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి బడా కార్పొరేట్ సంస్థలు రావాలని ఆలోచిస్తున్నారే తప్ప.. రైతులు, పేదలను గురించి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి విమర్శించారు. మంగళగిరి బైపాస్ రోడ్డులోని నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో ఆదివారం తాడేపల్లి పట్టణ వైసీపీ నేతలు, కార్యకర్తల ఆత్మీయసమావేశం నిర్వహించారు. వేమారెడ్డి మాట్లాడుతూ వైసీపీ శ్రేణులు సమన్వయంతో పని చేసి తాడేపల్లిలో మళ్లీ పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వేణుగోపాల స్వామిరెడ్డి, కృష్ణమూర్తి, మాజీ కౌన్సిలర్లు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భయం భయంగా విధులు !

- శిథిలావస్థలో తహసీల్దారు కార్యాలయం
- వర్షం కురిస్తే తడిసి ముద్దవ్వాల్సిందే..
- పెచ్చులుడి పడుతున్న సిమెంట్ శ్లాబు
- ఆందోళన చెందుతున్న ఉద్యోగులు, సిబ్బంది


ప్రమాదభరితంగా తహసీల్దార్ కార్యాలయ ముందు భాగం

నిర్మాణం జరిగిన 20 ఏళ్లు నిండకుండానే మేడికొండూరు తహసీల్దారు కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం కురిసిందా తడిసి ముద్దవ్వాల్సిందే. ఊడి పడుతున్న సిమెంట్ పెచ్చులు ఉద్యోగులను, సిబ్బందిని భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కు మంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఫ్యాన్ కింద కూర్చోవాలంటే ఏ సమయంలో ఊడి పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

మేడికొండూరు నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కార్యాలయాలన్ని ఒకే చోట ఉంటాలన్న లక్ష్యంతో మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ పక్కపక్కనే ఉండేలా భవనాలు నిర్మించారు. వాటిలో ప్రధానంగా తహసీల్దార్ కార్యాలయం శ్లాబ్, గోడలు పగుళ్లిచ్చి వర్షం కురిస్తే నీరు లోపలి గదులలోకి చేరుతుంది. టేబుళ్లు, బీరువాలు తడిసి పోతున్నాయి. అంతేకాకుండా సీలింగ్ ఉన్న సిమెంట్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. వారం రోజుల క్రితం తహసీల్దార్ గదిలోని సీలింగ్ పెచ్చులూడి పడిపోయింది. ఆ సమయంలో అక్కడెవరూ లేక పోవడం ప్రమాదం తప్పింది. దానిని గమనించిన సిబ్బంది పెచ్చులూడి పడిన సమయంలో ఎవరైనా ఉంటే వారి పరిస్థితి ఊహించుకుని వణికి పోతున్నారు. వర్షం కురిస్తే గదుల లోపలకు నీరు కారుతుండడంతో కంప్యూటర్లు ఫైళ్లు, రికార్డులు ఎక్కడ తడిసి పోతాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


శ్లాబు పెచ్చులూడిన దృశ్యం

నిర్మూలించలేరు... మరమ్మతులూ చేయరు..

ప్రస్తుతం తహసీల్దారు కార్యాలయ భవనం నిర్మించి 20 ఏళ్లు కూడా పూర్తి కాలేదంటున్నారు. నిబంధనల ప్రకారం 35 నుంచి 40 ఏళ్లు దాటితేనే ఆ భవనాన్ని కూల్చి కొత్త భవనం నిర్మించుకునే వెసులు బాటు ఉంటుంది. ఇటీవల ఇంజనీరింగ్ అధికారులు భవనాన్ని పరిశీలించి పగుళ్లకు మరమ్మతులు చేసినా ఫలితముండదని తేల్చారు. శ్లాబ్‌కింద పెచ్చులూడి ఇనుప చువ్వలు తుప్పుపట్టి కనిపిస్తున్నాయి. పెచ్చులూడిని ప్రాంతంలో తిరిగి సిమెంట్ ప్లాస్టింగ్ చేసినా ఎక్కువ కాలం ఉండదని, మళ్లీ ఊడి పడిపోతూనే ఉంటుందని తెలిపారు. భవన నిర్మాణ వయస్సు రీత్యా దానిని నిర్మూలించే అవకాశం లేదని తెలిసింది. అప్పటి వరకు ఈ కార్యాలయంలో ఎలా పనిచేయాలా అని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయ భవనంలోకి మార్చాలని వినతి

శిథిలావస్థలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం పక్కనే గత ప్రభుత్వం గ్రామ సచివాలయం కోసం భవనం నిర్మించింది. అయితే దానిలో ఎటువంటి వసతులు కల్పించకుండా వదిలేయడంతో ఖాళీగా ఉంది. ఆ భవనాన్ని తహసీల్దార్ కార్యాలయానికి కేటాయిస్తే ఉద్యోగులతో పాటు రికార్డులకు, కంప్యూటర్లకు కొంత భద్రత ఉంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం పంచాయతీ కార్యాలయ భవనంలో గ్రామ సచివాలయం నడుస్తున్నందుకు దాని కోసం నిర్మించిన భవనాన్ని తహసీల్దార్ కార్యాలయానికి కేటాయించాలని గ్రామస్థులతో పాటు రెవెన్యూ సిబ్బంది కోరుతున్నారు.

పశ్చిమడెల్టాకాల్వకు 4012 క్యూసెక్కులు

దుగ్గిరాల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకాల్వకు 4012 క్యూసెక్కుల సాగు నీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉంది. కాగా దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 172 క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 842 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 146 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 113 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 238 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 2360 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

రాజధాని కంప నుగ్గు నుగ్గు !


సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో కంపను నుగ్గు చేస్తున్న యంత్రం

- రంగంలోకి దిగిన భారీ టబ్ బకెట్ యంత్రం
- త్వరలో మరికొన్ని యంత్రాలతో పనులు
- ఆయా వ్యర్థాలు వృథా కాకుండా వినియోగం లోకి..

తుళ్లూరు, నవంబరు 17: (ఆంధ్రజ్యోతి) రాజధాని అమరావతిలో తొలగించిన కంపను తగలబెట్టకుండా ఓ భారీ యంత్రంతో నుగ్గు, నుగ్గు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాజధాని నిర్మాణాన్ని విస్మరించి, 26 వేల ఎకరాలలో భారీగా ముళ్ల కంపను పెంచిన విషయం తెలిసిందే. అయితే ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాజధాని అమరావతి నిర్మాణ పనులను కొనసాగిచింది. ఈక్రమంలో ముందుగా రాజధాని భూముల్లో ముళ్ల కంపను తొలగించేందుకు (జంగిల్ క్లియరెన్స్‌కు) టెండర్లను ఆహ్వానించింది. ఎన్‌సీసీ కంపెనీ 36.50 కోట్లతో టెండరును దక్కించుకొని కంపను తొలగించే పనిని ప్రారంభించింది. నెల రోజుల్లో కంపను పీకేశారు. మొదట ఆ కంను తగలబెడామని అనుకున్నారు. కాలుష్య సమస్య ఏర్పడుతుందని ఆగిపోయారు. ప్రస్తుతం ఆ కంప ఎండి పోయి ఉండటంతో నుగ్గు చేసే యంత్రాన్ని రంగలోకి దించారు. నెల రోజుల్లో కంప మొత్తం నుగ్గు అయిపోవాలని సబ్ కాంట్రాక్టర్‌కు ఎన్‌సీసీ అప్పజెప్పింది. నుగ్గు అయిన కంప వృథా కాకుండా బ్రికెట్స్ తయారికి, సిమెంట్ కంపెనీల బాయిలర్లలోకి, ఎనర్జీ ప్లాట్‌లకు, ఇటుక బట్టీలలో వాడటానికి విక్రయిస్తున్నారు. ముందుగా సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో టబ్ గ్రైండర్ యంత్రం పనిచేస్తుంది. మరో రెండు యంత్రాలను తీసుకొచ్చే ఆలోచనతో గుత్తేదారు ఉండట్లు తెలుస్తుంది.

డిసెంబర్ ఆఖరు కల్లా రాజధాని పనులకు టెండర్లు ఖారారు కానున్నాయి జనవరి మొదటివారం నుంచి నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయని భావిస్తున్నారు. అప్పటి లోగా కంప మొత్తం క్లియర్ కావాలని సీఆర్‌డీఏ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కల్నల్ శశికాంత్, సొసైటీ ప్రతినిధులు

పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

మంగళగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీ మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ 41వ వార్షికోత్సవం సందర్భంగా తెనాలి రోడ్డులోని పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆదివారం విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ కల్నల్ తుమ్మా శశికాంత్ మాట్లాడుతూ విద్యార్థి దశలో కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు సిద్ధిస్తుందని, విద్యార్థులు మంచి నడవడికతో చదువుకోవాలని సూచించారు. సొసైటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ గత 41 సంవత్సరాలుగా చేనేత వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించడంతోపాటు ఉపకార వేతనాలు, నోటుపుస్తకాలు అందిస్తున్నట్టు చెప్పారు. సొసైటీ కార్యదర్శి ప్రెగడ రాజశేఖర్ మాట్లాడుతూ ఈ ఏడాది ఇంటర్ నుంచి పీజీ వరకు చదువుతున్న 572 మంది విద్యార్థులకు రూ.18.24 లక్షల విలువ చేసే ఉపకార వేతనాలు, క్యాలిక్యులేటర్లు, బ్యాగులు, నోటుపుస్తకాలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, సొసైటీ ప్రతినిధులు, దాతలు బిట్రా వెంకటేశ్, దామర్ల శ్రీనివాసరావు, కన్నా మాస్టార్, స్వర్గం పుల్లారావు, వంగల దీప్ పాల్గొన్నారు.



ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ

ఎత్తిపోతల పథకం ప్రారంభం

పెదనందిపాడు, నవంబరు, 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఓగేరు వాగుపై ఉన్న శ్రీనివాసా ఎత్తిపోతల పథకాన్ని ఆదివారం మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సొంతగా నగదు ఏర్పాటు చేసుకొని మరమ్మతులు చేయించి పథకాన్ని వినియోగంలోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ పథకం ద్వారా రెండు జిల్లాల్లో 4వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మండలాన్ని రోల్ మోడల్‌గా అభివృద్ధి చేద్దాం

- సర్వసభ్య సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీపీ జబీన్
- అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం



మండలపరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్

దుగ్గిరాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్న మంత్రి నారా లోకేశ్ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు, సభ్యులు సమన్వయంతో పని చేయాలని ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జబీన్‌మాట్లాడుతూ నాలుగు నెలల కాలంలో కూటమి ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనివిధంగా జెట్ స్పీడ్‌తో అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. జడ్పీటీసీ మేకతోటి అరుణకుమారి మాట్లాడుతూ, గతంలో మంజూరైన నిధులతో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని, సంక్షేమం అభివృద్ధి పనులకు సహకారం అందించాలన్నారు. మండల ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయిచైతన్య మాట్లాడుతూ, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గ్రామపంచాయతీ నిధులు పూర్తిగా గ్రామాభివృద్ధికే వినియోగించేలా రాష్ట్రం మొత్తం ఒకేసారి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం ద్వారా ఆంధ్రప్రదేశ్ పేరు గిన్నిస్‌బుక్‌లో నమోదైందన్నారు. పీఎం సూర్యాఘర్ పేరిట కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన సోలార్ విద్యుత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా కలిగే ప్రయోజనాలను సోలార్ సంస్థ ప్రతినిధి కేఎస్ రాజు వివరించారు. పేరుకలపూడి ఎంపీటీసీ తాళ్ల అశోక్ మాట్లాడుతూ పేరుకలపూడి పీహెచ్‌సీ ఉపకేంద్రంలో కనీసం బరువుతూచే యంత్రంకూడా లేదని, పలుమార్లు వివిధ సమస్యలను ఆరోగ్యశాఖ అధికారులదృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదన్నారు. సమస్యలను ప్రస్తావించే సమయంలో కొన్నిశాఖల అధికారులు సమావేశంలో లేక పోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఏఈ సత్యనారాయణ మాట్లాడుతూ, మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే అంచెలంచెలుగా విద్యుత్‌స్మార్ట్ మీటర్ల ఏర్పాటు జరుగుతుందన్నారు. ఏవో పి.శిరీష మాట్లాడుతూ మండలంలో రైతులు పండిస్తున్న సుమారు 22 వేల ఎకరాల వరి పంట నమోదు చేయడం జరిగిందని, నమోదు చేసిన ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం ఈనెల 18 నుంచి కొనుగోలు చేస్తుందని తెలిపారు.

ఎంపీడీవో ఏ.శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలం లోని 18 గ్రామాల్లో ఇప్పటికే సర్వే పూర్తైందని, 137 కి.మీ.ల మేర భూగర్భడ్రైనేజీని రూ.115 కోట్లతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నామన్నారు. ఎంఈవో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, మనబడి-మనభవిష్యత్ ద్వారా 13 పాఠశాలల్లో మూడో విడత అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామన్నారు. చిలువూరులో ప్రభుత్వ జడ్పీ హైస్కూల్ ఏర్పాటుకు స్థలాన్నిచూసి, విద్యార్థుల ఇబ్బందులను తొలగించాల్సి ఉందన్నారు. జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, గృహ నిర్మాణ శాఖ, నీటిపారుదల శాఖ ఏఈలు, ఐసీడీఎస్, ఎన్‌ఆర్ఈజీఎస్ ఏపీఎం, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



రామ్మూర్తినాయుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

రామ్మూర్తినాయుడు మృతి తీరని లోటు

తాడికొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతి పార్టీకి తీరనిలోటని తాడికొండ మండల టీడీపీ అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు ఇటీవలన ఆనారోగ్యంతో మృతి చెందగా, ఆదివారం తాడికొండ మండల టీడీపీ కార్యాలయంలో రామ్మూర్తి నాయుడి చిత్రపటానికి టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్‌మాట్లాడుతూ రామ్మూర్తినాయుడు గతంలో చంద్రగిరి నియోజకవర్గంకు ఎమ్మెల్యేగా పనిచేశారన్నారు. టీడీపీ బలోపేతానికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మేదర బీసీ సాధికారి సమితి రాష్ట్ర కన్వీనర్ ధూళిపాళ్ల ఏసుబాబు, యువ నాయకులు బండ్లమూడి లింగయ్యచౌదరి, మద్దుల సాయి, ముదిగొండ సాయి, తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరు (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి ఆదివారం మేడికొండూరు టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫిరంగిపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నార్నె శ్రీనివాసరావు, మేడికొండూరు మాజీ జడ్పీటీసీ సభ్యుడు పాములపాటి శివన్నారాయణ, జీ.చంద్రశేఖర్, షేక్ ఖాజా, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విజ్ఞానదాయక సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలు దోహదం

- ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు
- వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న వారోత్సవాలు



మంగళగిరిలో వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న గ్రంథాలయాధికారి

పెదనందిపాడు, నవంబరు, 17 (ఆంధ్రజ్యోతి) : విజ్ఞానదాయక సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలు దోహదపడతాయని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గేరా మాట్లాడుతూ జాతీయ స్ఫూర్తికి, విద్యావ్యాప్తికి గ్రంథాలయాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని, యువత, విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్‌లకు బానిసలు కాకుండా గ్రంథాలయాల్లో పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.సుభాషిణి, విశ్రాంత ఉపాధ్యాయులు కొర్రపాటి సువార్త, బోరుగడ్డ శ్యాంసన్, గారపాటి రమేష్, మంజుల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో ...

తాడేపల్లి టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 4వ రోజైన ఆదివారం తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో సీనియర్ విభాగం ఆధ్వర్యంలో పర్యావరణం అనే అంశం మీద చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీను మాస్టారు విచ్చేసి మాట్లాడారు. చిత్రలేఖనం అనేది మనిషిలోని అంతర్ముఖ సృజనాత్మకతను వెలికితీస్తుందన్నారు. గ్రంథాలయ అధికారి షేక్ నాగూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో...

మంగళగిరి సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళగిరి శాఖా గ్రంథాలయంలో ఆదివారం వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.ఆరోగ్యం పోటీలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు గ్రహీత వైనాగకుమారి, ఎ.శివ, రికార్డ్ అసిస్టెంట్ పీ.కృష్ణ, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెదనందిపాడు సమావేశంలో మాట్లాడుతున్న గేరా మోహనరావు



తాడేపల్లిలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సీపీఆర్‌పై అవగాహన

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా గుండెపోటుకు గురైనప్పుడు వారికి సీపీఆర్ ఎలా అందించాలో ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలని ఆరోగ్య భారతి వైద్య నిపుణులు సూచించారు. స్థానిక అరండల్‌పేటలోని యోగి భవన్‌లో ఆదివారం ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో 'బేసిక్ లైఫ్ సపోర్టు' అనే అంశంపై ఆరోగ్య మిత్ర కార్యశాల జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు డాక్టర్ కె ఎస్ ఎన్ చారి, డాక్టర్ పి ఎస్ రావు, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ కాకాని పృథ్వీరాజు, డాక్టర్ శ్రీనివాసరెడ్డి డాక్టర్ సీతారాం కిషోర్, డాక్టర్ కల్లగంటి నాగార్జున పాల్గొని వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. పిల్లల చేత ప్రదర్శన చేసి చూపించారు, ప్రథమ చికిత్స గురించి రోగి గాయపడిన తర్వాత హాస్పిటల్‌కి చేరే లోపల ప్రాణాన్ని ఎలా కాపాడాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య జీవనశైలి ఎలా ఉండాలి, ఎలాంటి ఆహారం తీసుకోవాలి, మానసికత ఎలా ఉండాలి అనే విషయాలను వివరించారు.

అవగాహన ఆధ్వర్యంలో

ఆరోగ్య సభ

గుంటూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యం, స్మోకింగ్, వాతావరణ కాలుష్యాల వల్లనే శ్వాసకోశ వ్యాధులు పెరుగుతున్నాయని పల్మనాలజిస్టు డాక్టర్ డీఎస్ఎస్ వీ శ్రీదేవి తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్యసభలో ఆమె ప్రసంగించారు. డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ ఇటీవల అత్యధికంగా పెరుగుతున్న సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. వయస్సు పెరుగుతున్న కొద్దీ శ్వాసకోశ సమస్యలు వస్తుంటాయని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండొచ్చని తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

● మేడికొండూరులో ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



ఫిరంగిపురంలో పాటల పోటీలు నిర్వహిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు కే ఫ్రాన్సిస్

మేడికొండూరు నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అందరికి అందుబాటులో విజ్ఞానాన్ని, విలువైన సమాచారాన్ని అందించే గ్రంథాలయాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి పాలడుగు సుధారాణి కోరారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మేడికొండూరులోని శాఖ గ్రంథాలయంలో ఆదివారం నాలుగో రోజున విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు చేరువలో ఉన్న గ్రంథాలయాలలో అనేక మంచి పుస్తకలు అందుబాటులో ఉంటాయని, వాటిని చదవడం ద్వారా మంచి ఆలోచనలతో పాటు సమాజ హితం గురించిన అవగాహన పెంపొందుతుందని తెలిపారు. గ్రంథాలయాల వలన ఉపయోగాలు, పుస్తక ప్రదర్శన, చిత్రలేఖనం వంటి కార్యక్రమాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు గణేష్, నెలకుదిటి గోపి. అనంతలక్ష్మి తదితరులతో పాటు వివిధ గ్రామాల పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఫిరంగిపురం, (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురంలోని గాలిబాలి గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయ అధికారి జీ జేమ్స్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. గ్రామంలోని వివిధ విద్యాసంస్థల విద్యార్థినీ, విద్యార్థులు ఈ పాటల పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాకుమాను ఫ్రాన్సిస్, గ్రంథాలయ సిబ్బంది బీవీ కృష్ణమూర్తి, సైదా సాహెబ్, మరియలేయ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం ఏర్పాటు అభినందనీయం

● తుళ్లూరు డీఎస్పీ మురళీ కృష్ణ

● ఉచిత కంటి వైద్యశిబిరం ప్రారంభం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ మురళీ కృష్ణ

తుళ్లూరు, నవంబరు 17: (ఆంధ్రజ్యోతి) : రోగుల సహాయార్థం ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమని తుళ్లూరు డీఎస్పీ మురళీ కృష్ణ అన్నారు. ఆదివారం శంకర కంటి ఆస్పత్రి వారి సహకారంతో బండ్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తుళ్లూరులో నిర్వహించిన ఉచిత కంటి శిబిరాన్ని డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి అవసరమని పేర్కొన్నారు. శిబిరంలో కంటిసమస్యలున్న 250 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆపరేషన్‌లు అవసరమైన వారికి హాస్పటల్‌లో ఉచితంగా చేస్తారని డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు బండ్ల పట్టాభిరామయ్య, మాజీ ఎంపీటీసీ జొన్నలగడ్డ కిరణ్ టీడీపీ నాయకులు జొన్నలగడ్డ శంకర్, కాటా అప్పారావు, జమ్ముల అనిల్, గద్దె బాబు, జమ్ముల హరికిరణ, తదితరులు పాల్గొన్నారు. సీఐలు వెంకటేశ్వర్లు, అంజియ్యలు శిబిరాన్ని సందర్శించి వైద్యులకు, ట్రస్ట్ సభ్యులకు అభినందనలు తెలిపారు.

19న బ్యాంకు విశ్రాంత

ఉద్యోగుల మహా ధర్నా

గుంటూరు (తూర్పు), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ బ్యాంక్ రిటైర్డ్ ఫెడరేషన్, ఏపీ బ్యాంక్ రిటైర్డ్ ఫెడరేషన్ సంయుక్త పిలుపు మేరకు ఈ నెల 19న విజయవాడ అలంకార్ కూడలి వద్ద రాష్ట్ర స్థాయి మహాధర్నాను చేపట్టనున్నట్లు జిల్లా బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల కో ఆర్డినేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేవీబీ మురళీ కృష్ణారావు తెలిపారు. స్థానిక బ్రాడీపేట బ్యాంకు ఉద్యోగుల భవనం (బ్యాంకర్స్ క్లబ్)లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. సుదీర్ఘ కాలంగా ఉన్న పెన్షన్ విధానాన్ని పునఃసమీక్షించాలని, మెడికల్ ఇన్సూరెన్స్‌లో చెల్లిస్తున్న ప్రీమియంను తగ్గించాలని డిమాండ్ చేశారు. పెన్షన్‌దారులు తీసుకున్న రుణాలను 10 సంవత్సరాల లోపు చెల్లించినా, కోర్టుల ఆదేశాలను పక్కనబెట్టి 15 సంవత్సరాల వరకు రికవరీ చేయటం వెంటనే ఆపేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ధర్నాలో ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయ కులు కే.హరిబాబు, వై.కోటేశ్వరరావు, ఎస్‌ఆర్‌ఎస్ శ్యామ్, వై.హనుమంతరావు, ఎంపీ పుల్లయ్య, ఏ.వెంకయ్య, పి.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

వైన్ షాపు వద్దంటూ

ప్రజల ఆందోళన

గుంటూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గుడి, బడికి, నివాసప్రాంతాలకు దూరంగా వైన్ షాపును ఏర్పాటు చేసుకోవాలంటూ నందివెలుగు రోడ్డులో ఏర్పాటు చేసిన వైన్ షాపును తొలగించాలని స్థానిక పద్మనగర్, పరిసర ప్రాంత ప్రజలు ఆదివారం ఆందోళనకు దిగారు. దేవాలయాలు, ప్రభుత్వ గురుకుల వసతి గృహం, లేడీస్ హాస్టల్స్ ఉన్న ప్రాంతాల్లో ఈ వైన్ షాపును ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమని నిబంధనలకు విరుద్ధమంటూ నిరసన తెలిపారు. ఈ నూతన వైన్ షాపు వలన రానున్న రోజుల్లో అనేక ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని, అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకుని వైన్ షాపును వేరే ప్రాంతానికి తరలించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

ఐక్యంగా ఉండి పదవులు సాధించుకోవాలి

● ఏసీబీ విశ్రాంత డీజీ పూర్ణచంద్రరావు

● ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంఘం ఐక్యత మహోత్సవం



ఐక్యతా మహోత్సవంలో విశ్రాంత ఏసీబీ డీజీ పూర్ణచంద్రరావు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య తదితరులు

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుమ్మర శాలివాహనులు ఐక్యంగా ఉంటే రాజకీయ పదవులు వాటంతటవే వెతు క్కొంటూ వస్తాయని ఏసీబీ విశ్రాంత డీజీ జే.పూర్ణ చంద్రరావు అన్నారు. స్థానిక నల్లపాడు రోడ్డులోని నగర వనం సమీపంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంఘం ఐక్యత మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమాన్ని అసోసియేషన్ జిల్లాఅధ్యక్షుడు ఇందుర్తి శివన్నారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పూర్ణచంద్రరావు పాల్గొన్నారు. కుమ్మర శాలివాహనులంతా ఒక మాటపై నిలబడి కార్యక్రమాలు నిర్వహిస్తుంటే పార్టీలే వెతుక్కొంటూ వచ్చి పదవులు ఇస్తా యన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ కుమ్మర శాలి వాహనులు ఎదుర్కొంటున్న మట్టి సమస్యలపై తనకు అవగాహన ఉందని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని, శాలివాహన చక్రవర్తి విగ్రహం ఏర్పాటుకు సహకరిస్తానని అన్నారు. మహోత్సవంలో అసోసియేషన్ నాయకులు భాస్కర శ్రీనివాస్, రాజవరపు ఏడుకొండలు, కల్పతరువు రవి పాల్గొన్నారు.



పార్టీల నేతలతో మాట్లాడుతున్న తహసీల్దారు

ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించండి

కాకుమాను, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికలకు మండలంలోని రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని తహసీల్దారు వెంకటస్వామి కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆదివారం ప్రధాన రాజకీయ పార్టీల నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను స్థానిక జడ్పీ హైస్కూల్లో దక్షిణ వైపు 2వ గదిలో నిర్వహించుటకు రాజకీయ పార్టీల నేతలు ఏకగ్రీవ ఆమోదాన్ని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నువ్వుల సునీల్ చౌదరి, జనసేన నేత గడ్డం శ్రీనివాసరావు, బీజేపీ మండల మోర్చా అధ్యక్షుడు యడ్లపాటి శ్రీధర్, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందజేస్తున్న టీడీపీ నాయకులు

చిరు వ్యాపారులకు బండ్లు పంపిణీ

తుళ్లూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) మాజీ ఎంపీటీసీ తుళ్లూరు మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు జొన్నలగడ్డ కిరణ్‌కుమార్ చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ చేసి దాతృత్వం చాటుకున్నారు. ఆదివారం తుళ్లూరులో చిరు వ్యాపారాలు చేసుకునే నిరుపేద కుటుంబాలకు చెందిన అరివేణి రాణి, కొజ్జా వెంకటేశ్వర్లు, దేవనషైన మస్తాన్, వేల్పుల యశోదలకు తోపుడు బండ్లను వితరణగా అందజేశారు. ఈ రెండు నెలల కాలంలో 20 పైగా తోపుడు బండ్లను కిరణ్ పంపిణీ చేశారు. 'మన అమరావతి.. మన ఆంధ్రప్రదేశ్. నారా లోకేశ్ స్ఫూర్తితో తాను ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాటా అప్పారావు, నాయకులు బండ్ల పట్టాభిరామయ్య జమ్ముల అనిల్, మూల్పూరి రాంబాబు, పాటిబండ్ల జయకృష్ణ, బండ్ల కోటేశ్వరావు, సూరిబాబు, గద్దె బాబు, కొల్లి నరేంద్ర, మల్లెల శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ మేకల చిన్నాబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



తుళ్లూరులో రామ్మూర్తి నాయుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

పార్టీ మంచి నేతని కోల్పోయింది

● టీడీపీ తుళ్లూరు మండల నేతలు

● మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తినాయుడి చిత్రపటానికి నివాళులు

తుళ్లూరు, నవంబరు 17: (ఆంధ్రజ్యోతి) సౌమ్యుడు, మృదు స్వభావి, మంచి నాయకుడు అయిన రామ్మూర్తి నాయుడుని పార్టీ కోల్పోయిందని టీడీపీ తుళ్లూరు మండల నేతలు అన్నారు. మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు మృతి చెందగా ఆదివారం మండల కేంద్రం తుళ్లూరు పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు ధనేకుల వెంకట సుబ్బారావు మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు సోదరుడు, రామ్మూర్తి నాయుడు మరణం పార్టీ వర్గాలను కలచి వేసిందన్నారు. ఆయన మరణం పార్టీకి తీరనిలోటని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు, తెలుగు రైతు ఉపాధ్యక్షుడు నూతలపాటి రామారావు, నాయకులు కాటా అప్పారావు, జొన్నలగడ్డ కిరణ్, సాహెబ్‌జాన్, జమ్ముల అనిల్, కొమ్మినేని రఘు, గడ్డం వెంకటేశ్వరావు, జొన్నకూటి ఏడుకొండలు, మేఘవత్ లక్ష్మయ్య, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు జరుపుతున్న కీళ్లు, ఎముకల వైద్యుడు డాక్టర్ కమ్మెల హరీష్

రోగులకు ఉచిత వైద్య పరీక్షలు

దుగ్గిరాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం దుగ్గిరాలలో మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో వెయ్యి మందికి పైగా రోగులకు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. తెనాలి, విజయవాడ, గుంటూరుకు చెందిన వైద్యులు పాల్గొని ఉచితంగా పరీక్షలు జరిపారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వ్యవస్థాపకుడు వంగర సురేష్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన శిబిరాన్ని మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత తదితరులు సందర్శించి సురేష్ వైద్య, విద్యా రంగాలకు చేస్తున్న సేవలను అభినందించారు. రోగులకు వైద్యులు కమ్మెల హరీష్, వంశీ, వినోద్, శ్రీలక్ష్మి, మాధురి, కృష్ణలీల, శ్రీకర్, శ్రావణి, ప్రశాంతి, రాధిక, రాజశేఖర్, మిధునేశ్వర్‌రెడ్డి, భార్గవ్, డీ. శశిధర్ తదితరులు వైద్య పరీక్షలు జరిపారు. పరీక్షల్లో శస్త్రచికిత్సలు అవసరమైన వారిలోఆరోగ్యశ్రీకార్డు కలిగిన వారికి ఉచితంగా జరిపిస్తామన్నారు. అవసరమైన రోగులకు మందులు ఉచితంగా అందించారు.

తెగల మధ్య తగవులు తగవు

● 'మణిపూర్ నగ్న కవాతు' ఆవిష్కరణలో సాహితీవేత్త రజా హుస్సేన్

గుంటూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మణిపూర్‌లో తెగల మధ్య తగవులు తగ వని ప్రముఖ సాహితీవేత్త అబ్దుల్ రజా హుస్సేన్ తెలిపారు. అమరావతి సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేటలోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. సమావేశానికి అవ ఎరావతి సాహితీ మిత్రులు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు అధ్యక్షత వహిం చారు. రజా హుస్సేన్ సంకలనం చేసిన 'మణిపూర్ నగ్న కవాతు' కవితల గ్రంథాన్ని ప్రముఖ భాషా సేవకులు పారా అశోక్ కుమార్ ఆవిష్కరించారు. అనంతరం రజా హుస్సేన్ మాట్లాడుతూ మణిపూర్‌లో దారుణకాండ జరుగుతోందని, ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. మణిపూర్‌లో శాంతిభద్రతలు నెల కొనేలా కృషి జరగాలని అన్ని వర్గాలకు ఆయన హితవు పలికారు. మణిపూర్ బాధలను గురించి కవి తలు పంపిన కవులందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'ఈ మాసం కవి'గా సార స్వత ప్రేమికులు పూసపాటి కృష్ణ సూర్యకుమార్ పాల్గొని ఆయన రాసిన బంధ కవిత్వాన్ని వినిపించారు. 'చిలుక శతకం'లోని అనేక పేరడీ పద్యాలను వినిపించి సభను అలరింపచేశారు. వివిధ సామాజిక సమస్యలపై పలు మినీ కవితలు కూడా వినిపిం చారు. పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన 'నిక్కచ్చి కవితకోసం కవితా పఠన కార్యక్రమంలో 'గుంటూరు' అనే అంశంపై గడల శివప్రసాద్, రేపల్లె రాజ్ కృష్ణ, చల్లా సత్య వతి (పిడుగురాళ్ల), మేడిశెట్టి సుభద్రా కృష్ణ, డాకోజు శివకుమార్, గోలి మధు (మంగళ గిరి), మైలవరపు లలితకుమారి, మన్నం వెంకటగురువు మొదలైన వారు కవితలు వినిపించారు. కవితల సంకలనకర్త అబ్దుల్ రజా హుస్సేన్‌ను, 'ఈ మాసం కవి' పూసపాటి కృష్ణ సూర్య కుమార్‌ను, 'నిక్కచ్చి కవిత'గా ఎంపికైన మేడిశెట్టి సుభద్రా కృష్ణను సంస్థ పక్షాన డాక్టర్ రావి రంగారావు, పారా అశోక్ కుమార్, డాక్టర్ సేవా కుమార్ ఘనంగా సత్కరించారు. శాంతశ్రీ ట్రస్ట్ వారు 'నిక్కచ్చి కవిత' సత్కార గ్రహీతకు రూ. 500 నగదు బహుమతి అందజేశారు.

నోబుల్ టీచర్స్ అసోసియేషన్

నగర నూతన కార్యవర్గం ఎన్నిక

గుంటూరు(విద్య),నవంబరు 17(ఆంధ్ర జ్యోతి): నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నగర కార్యవర్గ ఎన్నిక ఆదివారం స్థానిక కొత్తపేటలోని జలగం రామారావు స్కూల్‌లో నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా ఎస్.వేణుగోపాల రావు, అధ్యక్షుడిగా పి.సాయివిశ్వనాథ్, ప్రధాన కార్య దర్శిగా పి.లలితబాబు, ఆర్థిక కార్యదర్శిగా కేవీ రాఘవులు, అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్.వెంకటేశ్వర్లు, రత్నశ్రీ, ఎ.హరగోపాల్, ఎస్.నాగరాజు, ఉపాధ్యక్షులుగా ఎ.వెంకటేశ్వర రావు, ఎస్.క్రీస్తురాజు, జీవీ అమృతలత, అద నపు ప్రధాన కార్యదర్శులుగా టి.శ్రీనివాసరావు, ఏవీ కృష్ణారావు, సీహెచ్ సత్యవాణి, కార్యదర్శులుగా కె.పూర్ణచంద్రరావు, ఎం.బాబూరావు, జిల్లా కౌన్సిలర్లుగా కె.వేణు గోపాలరావు, పి.చెంచయ్య, వై.ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. నూతన కమిటీ పరిశీలకుడిగా ఎన్‌టీఏ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌ఖలీల్ వ్యవహరించారు. నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఎన్‌టీఏ రాష్ట్ర కార్యదర్శి బి.హైమారావు, ఎన్‌జీవో నాయ కులు ఘంటసాల శ్రీనివాస రావు, సతీష్ అభినందించారు.

కార్గిల్ యుద్ధ వీరులకు నివాళి

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 25వ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా యుద్ధవీరులకు సైనికోద్యోగులు నివాళులర్పించారు. ఆదివారం మద్రాసు ఇంజనీరింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయము నుంచి బ్రిగేడియర్ వీ వెంకటరెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మెగా బైక్ ర్యాలీ నగరంలోని ప్రధాన వీధుల్లో నిర్వహించారు. అనంతరం మాజీ సైనికుల సమస్యలను ధరఖాస్తులను స్వీకరించి పరిష్కరించారు.



పుస్తకావిష్కరణలో పాల్గొన్న చలపతిరావు, సత్యనారాయణ, కృష్ణేశ్వరరావు, బాలచందర్, రామలక్ష్మి తదితరులు

'స్త్రీల పాటలు' పుస్తకావిష్కరణ

గుంటూరు(తూర్పు), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ స్వామి కళావేదికపై అజో-విభో కందాళం ఫౌండేషన్ , సంస్కృతి సంగీత నృత్య నాటక, సాహిత్య సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నందిరాజు చలపతిరావు రచించిన 'స్త్రీల పాటలు' పుస్తకావిష్కరణ సభ ఆదివారం నిర్వహించారు. సభకు ప్రముఖ రంగస్థల సినీ నటుడు, రచయిత, దర్శకుడు వైఎస్ కృష్ణేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి, ప్రముఖ సంగీత విద్వాంసురాలు వేమూరి రామలక్ష్మి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్త్రీల పాటలను పుస్తక రూపంలో పొందుపరచడం అభినందనీయమని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. విశిష్ట అతిథిగా ఆకాశ వాణి విశ్రాంత సంచాలకురాలు ముంజులూరి కృష్ణకుమారి గ్రంథ పరిచయం చేశారు. సభలో ద్రవిడ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తోట వెంకటస్వామి, అజో-విభో కందాళం ఫౌండేషన్ ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, సంస్కృతి నిర్వాహకులు సర్రాజు బాలచందర్‌లు రచయితను ఘనంగా సత్కరించారు.

పెండింగ్ బకాయిలు చెల్లించండి

● ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా

గుంటూరు(తూర్పు), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలును తక్షణమే చెల్లించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా అన్నారు. మెడికల్ కళాశాల ఆవరణలోని సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండేళ్ల నుంచి బకాయిలు చెల్లించకపోవడంతో విశ్రాంత ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, విశ్రాంత ఉద్యోగులకు, ప్రభుత్వ ఉద్యోగులకు నగదు రహిత చికిత్సలను అందజేయాలని చాంద్ బాషా కోరారు. ప్రతి ఉద్యోగి వద్ద నెలకు రూ 220 నుంచి రూ.330 వరకు ఈహెచ్‌సీ కింద వసూలు చేస్తున్నారని, కానీ ఈ విధా నాన్ని అమలు చేయడం లేదన్నారు. సమావేశంలో కేశవరెడ్డి, సీహెచ్ ముత్తయ్య, హనుమంత రావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం

గుంటూరు(తూర్పు), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతినగర్ లోని శ్రీ కంచి కామకోటి పీఠ శ్రీ మారుతి దేవాలయ ప్రాంగణంలో కార్తీక మాస మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం స్వామివారికి మాన్యాస ఏకాదశి రుద్రాభిషేకములు, ప్రదోషకాలంలో సహస్ర మృతిక లింగార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సామూహిక రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతములు నిర్వహించారు. సుమారు 120 మంది దంపతులు ఈ వ్రతంలో పాల్గొన్నారు.

చిరువ్యాపారికి తోపుడు బండి వితరణ

తెనాలి మారీసుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చిరువ్యాపారికి తోపుడు బండిని యంగ్ జనరేషన్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు అందజేశారు. స్థానిక మారీసుపేటలో ఆదివారం చిరువ్యాపారి మల్లేశ్వరావుకు యంగ్ జనరేషన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సాదిక్ తోపుడు బండిని అందించారు. దాతల సహకారంతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని సాదిక్ తెలిపారు. కార్యక్రమంలో శివసాయి, ఆలపాటి సాయి తదితరులు పాల్గొన్నారు.

మూడు సెల్‌ఫోన్లు చోరీ

తెనాలి అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల్లా బస్సు ఎక్కుతూ మూడు విలువైన సెల్‌ఫోన్లను కొట్టేసిన ఉదంతం తెనాలి బస్‌స్టేషన్‌లో ఆదివారం జరిగింది. తెనాలికి చెందిన ముగ్గురు విజయవాడ బస్సు ఎక్కారు. వారితో పాటు బస్సు ఎక్కిన చోరులు సెల్‌ఫోన్‌లు దొంగిలించి వెళ్లిపోయారు. బస్సు ఎక్కి సీట్లలో కూర్చున్న ముగ్గురు యువకులు జేబులో ఫోన్ చోరీకి గురైందని గ్రహించి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళితే, ఫిర్యాదును తీసుకోలేదని, యాప్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు సలహా ఇచ్చినట్లు సమాచారం. ఈ మూడు ఐఫోన్లు కావడంతో ఒక్కొక్క ఫోన్ రూ.75 వేలు నుంచి రూ.లక్ష వరకు విలువ చేస్తాయని బాధితులు తెలిపారు.

తూనికలు-కొలతల శాఖ అధికారుల తనిఖీలు

తెనాలి క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తూకాలలో మోసాలకు పాల్పడుతున్న వివిధ షాపుల్లో తూనికలు కొలతలు శాఖ అధికారులు ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో చినరావూరుతోట ప్రాంతంలో 13 మటన్, చికెన్, కూరగాయల అమ్మకాలు సాగిస్తున్న షాపుల్లో తక్కువ తూకాలతో యజమానులు మోసం చేస్తున్నట్లు గుర్తించడం జరిగిందని తూనికలు కొలతల ఇన్‌స్పెక్టర్ బి.శేషసాయి తెలిపారు. అసలు లైసెన్స్ లేకుండానే రెండు షాపుల్లో అమ్మకాలు సాగిస్తున్నట్లు గుర్తించామన్నారు. వాటిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కాటాలకు, కాటారాళ్లకు తప్పనిసరిగా తూనికలు, కొలతలు శాఖ అనుమతి ముద్రలు ఉండాలన్నారు. ఈ తనిఖీలలో టెక్నికల్ అసిస్టెంట్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన

కొల్లిపర, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపరలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు అన్నవరపు రమేష్ ఆధ్వర్యంలో వన సమారాధన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వన సమారాధన సందర్భంగా ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పండితులు సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించి కార్తీక మాసం విశిష్టతను గురించి వివరించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం పలు ఆటలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ఆర్యవైశ్య సంఘ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు మునగాల రామలక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి తాతా సతీష్‌కుమార్, కార్యదర్శి చుండూరు వెంకటరత్నం, ఆర్యవైశ్య సంఘ నాయకులు సుగ్గుల సురేష్‌కుమార్, బొల్లిశెట్టి హరిష్, చుండూరు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వీర శైవుల వన సమారాధన

తెనాలి మారీసుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సందడిగా వీరశైవులు కుటుంబ సభ్యులతో కలసి వన సమారాధన నిర్వహించారు. స్థానిక మారీసుపేటలోని దత్తసాయి మందిర ప్రాగంణంలో ఆదివారం వీరశైవ బసవేశ్వర సేవా సంఘం సభ్యులు కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించి ఉమామహేశ్వర వ్రతంను చేశారు. పట్టణ పరిసర గ్రామాలలోని వీరశైవులు పెద్ద సంఖ్యలో సమారాధనకు హాజరయ్యారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు చుక్కా సతీష్, సభ్యులు నేలవల్లి బసవయ్య, రాచంశెట్టి వంశీ కిరణ్, పాలకొల్లు బసవయ్య, దూపం ప్రసాద్, చంద్రారెడ్డి, చుక్కా శ్రీను, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బుర్రిపాలెంలో మెడికల్ క్యాంపు

తెనాలి అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఫార్మసీ వారోత్సవాలు పురస్కరించుకుని రూరల్ మండలం బుర్రిపాలెంలో ఆదివారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు షుగర్, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఫార్మసీ విద్యార్థులు, మెంటర్స్ నందగోపాలకృష్ణ, భార్గవి, సునీల్, ప్రిన్సిపాల్ వెంకటరమణ, ఉపాధ్యాయులు జ్యోతిబసు, కళ్యాణ చక్రవర్తి, లక్ష్మీదుర్గ, సర్పంచ్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

గంగానమ్మపేటలో వైద్య శిబిరం

తెనాలి అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గంగానమ్మపేటలోని కృష్ణా మెడికేర్‌లో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. షుగర్ వ్యాధి, గుండెపోటు వ్యాధులపై డాక్టర్ కృష్ణారావు అవగాహన కల్పించారు. షుగర్ వ్యాధి పరీక్షలు చేసి మందులు అందచేశారు.

డీఎస్సీ ఉచిత శిక్షణపై కేసన హర్షం

తెనాలి అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు హర్షం తెలిపారు. గుంటూరు రాజగారి తోటలో బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించడం బడుగు, బలహీన వర్గాల నిరుద్యోగులకు ఎంతో చేయూత ఇస్తుందన్నారు. అన్ని జిల్లాల్లోని బీసీ స్టడీ సర్కిల్స్‌లో అన్ని రకాల ఉద్యోగాలకు అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీని నియమించి శిక్షణ ఇవ్వాలని కోరారు. రాజధానిలో సివిల్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని, ముఖ్యమంత్రి, బీసీ సంక్షేమ శాఖ మంత్రిని కలిసి కోరగా ఇందుకు స్పందించారని అభినందించారు. డీఎస్సీ శిక్షణ కోసం రూ.450 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, ప్రతి జిల్లా నుంచి 250 మందికి 60 రోజుల శిక్షణ అందిస్తుందన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పాఠశాలల్లో నిలిచిన అభివృద్ధి పనులు

● కొన్నిచోట్ల మూలుగుతున్న నాడు-నేడు నిధులు, మరికొన్ని చోట్ల నిధుల్లేక నిలిపివేత

● పట్టించుకోని అధికారులు



మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతి గదులు

తెనాలి అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన నాడు-నేడు పథకంలో నిధులు కొన్ని పాఠశాలల్లో మూలుగుతుండగా, మరికొన్ని పాఠశాలల్లో నిధులు లేక ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. గత ప్రభుత్వం పాఠశాలలను పది అంశాల్లో అభివృద్ధి చేయతలపెట్టింది. ఫేజ్-1, ఫేజ్-2, ఫేజ్-2ఎ పేరిట నిధులు కేటాయించింది. అంచనాలు సక్రమంగా రూపొందించకపోవడంతో కొన్ని పాఠశాలల్లో ఉన్న నిధులు అనవసరం కాగా, మరికొన్ని పాఠశాలల్లో పనులకు అవసరమయ్యాయి. అవసరమైన పాఠశాలలను గుర్తించి నిధులు మిగిలిపోయిన వాటిని సర్దుబాటు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పనులు అసంపూర్తిగా ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ పథకాన్ని స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌గా మార్చారు. మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో 800 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ నిర్మిస్తున్న తరగతి గదులు పూర్తి కాకుండా ఉన్నాయి. ఇంటూరు, మోపర్రు, తురుమెళ్ల, మూల్పూరు, తెనాలి మండలంలో కొన్ని పాఠశాలల్లో నిధులు మిగిలిపోయి ఉన్నాయి.

విలీనంతో నిధులు వృథా....

నాడు-నేడు పథకం కింద అభివృద్ధి చేసిన ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో చేసిన పని అంతా వృథాగా మారింది. తాగునీరు, విద్యుత్, బెంచీలు, టాయిలెట్స్, కిచెన్ షెడ్లు, ప్రహరీ, తరగతి గదులు తదితర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రాథమిక పాఠశాలల్లో రూ.16 లక్షల నుంచి రూ.75లక్షల వరకు కేటాయించి పనులు చేశారు. విలీనం వలన ఆ ప్రాథమిక పాఠశాలలు 1, 2 తరగతులకే పరిమితం కావడం, ఒక్క ఉపాధ్యాయుడే ఉండటంతో తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా కొన్ని పాఠశాలలు మూతపడే స్థితికి చేరగా, మరికొన్నింటిలో విద్యార్థుల సంఖ్య ఒక అంకెకు మించడం లేదు. దీంతో అభివృద్ధి కోసం చేసిన ప్రజాధనం వృథా అయిందనే విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం విలీనాన్ని రద్దు చేస్తే మళ్లీ ప్రాథమిక పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడుతాయని భావిస్తున్నారు.

నిధులు.. పనులపై సమీక్ష చేయాలి...

నాడు-నేడు పథకం అమలు జరిపిన పాఠశాలల్లో నిధులు, పనుల పరిస్థితులను వెంటనే సమీక్షించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. నిధులు మిగిలిపోయిన పాఠశాలల నుంచి అవసరమైన పాఠశాలలకు బదిలీ చేసి పనులు పూర్తయ్యేలా చూడాలని సూచిస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్



క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు తీసుకుంటున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. బోసురోడ్డులోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం వైకుంఠపురం ఆలయంలో పద్మశాలీయుల కార్తీక వన సమారాధన ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్తీకమాసం పవిత్రమైనదని, ఆధ్యాత్మిక చింతన, భక్తి భావన మనసుకు స్వాంతన చేకూరుస్తుందన్నారు. మృత్యుంజయశర్మ, పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, తిరువీధుల సాంబశివరావు, పంచుమర్తి భాస్కరరావు, జొన్నాదుల కృష్ణ, సత్యనారాయణ, హేమంత్, అక్కల శ్రీరామ్ పాల్గొన్నారు.

పట్టణంలో మంత్రి మనోహర్ విస్తృత పర్యటన

తెనాలి పట్టణంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం విస్తృతంగా పర్యటించారు. బోసురోడ్డులో రహదారి విస్తరణ పనులతో పాటు పారిశుధ్యాన్ని పరిశీలించారు. రైతు బజారు వద్ద దుకాణాలను పరిశీలించి కొనుగోలు, అమ్మకందారులతో మాట్లాడారు. కూరగాయల వ్యర్థాలు ఎక్కడబడితే అక్కడ వేయడాన్ని ప్రశ్నించారు. కాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి ఉండటాన్ని గమనించి పూడికలు, కాల్వలు శుభ్రం చేయకపోవడంపై మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నించారు. రోడ్ల వెంట వ్యాపారులు చెత్త వేయడాన్ని గమనించి రోడ్లపై చెత్త వేస్తే ఎలా అంటూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గంగానమ్మపేట పాత శివాలయంలో దాతలసాయం రూ.10లక్షలతో చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఆలయ అధికారులు, అర్చకులు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. రామేశ్వరస్వామి వారిని దర్శించుకుని కార్తీక దీపాలు వెలిగించారు. గ్రంథాలయ వారోత్సవాల నేపథ్యంలో నెహ్రూ రోడ్డులోని శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయ అధికారి కావూరి రమాదేవి, పాఠకులతో ముచ్చటించారు. మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న, ఈవో రమణకుమారి పలువురు పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలి: మంత్రి మనోహర్

తెనాలి మారీసుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా భాగస్వాములు కావాలని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం స్థానిక గంగానమ్మపేటలోని పర్వతవర్ధని సమేత రామేశ్వరస్వామి వారి దేవస్థానంలో నూతనంగా ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైటింగ్ శిలాఫలకాన్ని మంత్రి మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించి లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్తీక మాసాన్ని పురష్కరించుకొని ఆలయంలో భక్తులకు ఏర్పాటుచేసిన సౌకర్యాలను స్వామివారికి జరుగుతున్న పూజాకార్యక్రమాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రి మనోహర్‌ను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం అనంతరం వేదాశీస్సులు అందించారు. మున్సిపల్ చైరపర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ శేషన్న, దేవదాయశాఖ అధికారులు, కూటమి నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం

తెనాలి అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని నెహ్రూరోడ్డులోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. తెలుగు భాషాభివృద్ధి-గ్రంథాలయాల పాత్ర అనే అంశంపై పలువురు సాహిత్యవేత్తలు పాల్గొని అభిప్రాయాలు, కవితలు వినిపించారు. గ్రంథాలయాధికారి కె.రమాదేవి సాహిత్యవేత్తలను సత్కరించారు. కార్యక్రమంలో ఆళ్ల నాగేశ్వరరావు, రఘునాథరావు, తన్నీరు శివశంకర్, నాగేశ్వరరావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. కొత్తపేట, పెదరావూరు, నందివెలుగు శాఖ గ్రంథాలయాల్లో వారోత్సవాలు పురస్కరించుకుని వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా కోటి దీపోత్సవం



కోటి దీపోత్సావాన్ని ప్రారంభిస్తున్న శ్రీవెంకటేశ్వర యోగా గురుజీ, బాలస్వామి తదితరులు

తెనాలి మారీసుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైభవంగా కార్తీక కోటి దీపోత్సవ మహోత్సవాన్ని శ్రీవిద్యాపీఠం, శ్రీ శాలిగ్రామ మఠం ట్రస్ట్ సభ్యులు సంయుక్తంగా నిర్వహించారు. స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో ఆదివారం బాలస్వామి స్వయం పర్యవేక్షణలో కార్తీక కోటి దీపోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, స్వామివారికి పంచామృతాలతో రుద్రాభిషేకం బిల్వపత్రార్చనలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర యోగ గురూజీ, టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు గుంటూరు కృష్ణా జిల్లాల అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు, ట్రస్ట్‌చైర్మన్ నంబూరు కృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, ఎం. రమణయ్య, గోపు రామకృష్ణ, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

దంత సంరక్షణపై అవగాహన శిబిరం



డాక్టర్ హిమబిందును సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

తెనాలి అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్‌లోని కవిరాజా పార్కులో ఆదివారం దంత సంరక్షణపై అవగాహన శిబిరం నిర్వహించారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో దంత వైద్య నిపుణులు డాక్టర్ హిమబిందు దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి దంత పరీక్షలు చేస్తే మంచిదని చెప్పారు. సభ్యులకు షుగర్ పరీక్షలు చేశారు. గుండె వ్యాధులు ఎదురైన సమయంలో సీపీఆర్ చేసే విధానాన్ని వివరించారు. గుత్తా వెంకటరత్నం, కడియాల రవిబాబు, రామాంజనేయులు, కాకుమాను రామమోహనరావు, మొవ్వా సత్యనారాయణ, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ పరిషత్ కార్తీక వన సమారాధన

తెనాలి అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. బోసు రోడ్డులోని నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కోటా పార్థసారథి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రావూరి ఆంజనేయశర్మ మాట్లాడుతూ, బ్రాహ్మణులంతా ఐక్యంగా సమాజ పురోభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యాలయ భవనం నిర్మించేందుకు కృషి చేయాలని చెప్పారు. 70 మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు. మాజీ అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తిని ఘనంగా సన్మానించారు. చింతపల్లి సాయికిరణ్, కనకదుర్గ, రామచంద్రమూర్తి, శ్రీనివాస్, లక్ష్మణ్, ఆంజనేయశాస్త్రి, వేణుగోపాల్, మౌనిక, సరళ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 140మందికి పరీక్షలు



వైద్య శిబిరంను పరిశీలిస్తున్న రోటరీ నిర్వాహకులు

పొన్నూరు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం వాస్క్యులర్ వ్యాధులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఏసియన్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 140 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 39మంది వ్యాధితో బాధపడుతునట్లు గుర్తించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రవి రాకేశ్‌దేవ్ మాట్లాడుతూ అర్హులైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా రూ.2 లక్షల వరకు వైద్య చికిత్సలు అందించనున్నట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ లేనివారికి 50 శాతం రాయితీతో వైద్య సేవలు అందించనునట్లు చెప్పారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి నన్నపనేని బాలకృష్ణ, వైద్యులు భార్గవ్, సాయి, రోటరీ నిర్వాహకులు రామారావు, మేఘనాథ్, రాధాకృష్ణ, భాను ప్రసాద్, రామకృష్ణ, వెలగ వెంకటేశ్వర్లు, కారుమూరి శ్రీను, రాజేంద్ర చౌదరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



లక్ష తులసీ దళ పూజ నిర్వహిస్తున్న అర్చక స్వాములు

భక్తి శ్రద్ధలతో లక్ష తులసీ దళ పూజ

చేబ్రోలు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేజండ్లలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం లక్ష తులసీ దళ పూజ వైభవంగా జరిగింది. పవిత్ర కార్తీక మాసంను పురస్కరించుకుని లోకహితార్థం లక్ష తులసీ దళార్చన నిర్వహించారు. వైకానస ఆగమశాస్త్ర ప్రకారం ఆలయంలో ఉదయం స్వామి వారి ఉత్సమూర్తులకు సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు సమర్పించారు. మండపార్ధన అనంతరం, సహస్రదీపారాధన జరిపారు. లక్ష్మీ నారాయణ యజ్ఞం నిర్వహించి రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాళ స్వామి వారి శాంతి కల్యాణం జరిపారు. అనంతరం గ్రామోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో జరిపారు. కార్యక్రమంలో అర్చకులు మాల్యవంతం రాఘవ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన పూజాదికాలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైకుంఠపురంలో 150 మంది దంపతుల సత్యదేవ వ్రతం

తెనాలి అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైకుంఠపురం ఆలయంలో ఆదివారం 150 మంది దంపతులు సత్యదేవ వ్రతం ఆచరించారు. శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతి ఆదివారం శ్రీరమా సహిత శ్రీసత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్నారు. ఆలయ మండపంలో అర్చకులు వ్రత పూజ చేస్తూ దంపతుల చేత వ్రతాన్ని ఆచరింపజేశారు. వ్రత ప్రాధాన్యతను, ఫలితాలను అర్చకులు వివరించారు. ఆలయ ఈవో అనుపమ, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కంభం సాయిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

వివేకానంద స్కూల్‌లో బాలనటుడు పుష్కర సందడి

తెనాలి అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వివేకానంద సెంట్రల్ స్కూల్‌లో బాలనటుడు పుష్కర సందడి చేశారు. బాలల చిత్రాల ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొని మిమిక్రీ ప్రదర్శించి విద్యార్థులను ఆకట్టుకున్నారు. విద్యార్థులు సినిమాల్లో ఉండే మంచిని గ్రహించాలని, చెడును విడనాడాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా ముందుకుపోవాలని చెప్పాడు. డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ, రామరాజు, బొల్లిముంత కృష్ణ, రత్నాకర్, వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

డిపో నష్టాల తగ్గింపునకు చర్యలు

● పొన్నూరు ఆర్టీసీ డిపో మేనేజర్ అజితకుమారి





పొన్నూరు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు ఆర్టీసీ డిపో నష్టాలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటూ ప్రజలకు అసవసరమైన రద్దీ రూట్లలో బస్సులు నడిచేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ మేనేజర్ టి అజితకుమారి ఆదివారం వెల్లడించారు. ఆంధ్రజ్యోతికి తెలిపిన వివరాలు.

ప్రశ్న: పొన్నూరు ఆర్టీసి డిపో ఆదాయం ఎంత ?

జవాబు: ప్రస్తుతం ఆర్టీసీ ప్రతి రోజూ సగటున రూ.5.50 లక్షలు ఆదాయం వస్తోంది. ఈ ఆదాయాన్ని మరింత పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: గ్రామాల్లో బస్సు రూట్లు నడిపే అవకాశం ఉందా?

జ: ప్రస్తుతం పొన్నూరు డిపో పరిధిలో చీరాల, గుంటూరు, నిజాంపట్నం, వట్టిచెరుకూరు, తెనాలి, ప్రాంతాలకు బస్సులు నడుపుతున్నాం. అలాగే రేపల్లె, భట్టిప్రోలు సర్వీస్ నడపాలని ప్రతిపాదనలు ఉన్నాయి. పెదనందిపాడు వరకు ఒక సర్వీస్ ఉండగా మరో రూటు నిర్వహించాలని ప్రయాణికుల విజ్ఞప్తి ఉంది.

ప్రశ్న: లాంగ్ రూట్లు, అంతరాష్ట్ర రూట్ల ప్రతిపాదనలు ఉన్నాయా?

జ: ప్రస్తుం పొన్నూరు నుంచి శ్రీశైలం, తిరుపతి, హైదరాబాద్ రూట్లలో సర్వీసులు ఉన్నాయి. గతంలో తెలంగాణలోని భద్రాచలం, ఖమ్మం జిల్లాలోని చర్ల రూట్‌కు బస్సు సర్వీస్ ఉండేది ఆ రూటు పునరుద్ధరించాలని ప్రయాణికులు పలుమార్లు కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

ప్రశ్న: సిబ్బంది కొరత ఉందా?

జ: పొన్నూరు డిపోలో ప్రస్తుతం 220 మంది సిబ్బంది ఉన్నారు. సిబ్బంది కొరత లేదు. అప్రంటీస్ శిక్షణ కింద మరో ఏడుగురుని కేటాయించే అవకాశం ఉంది.

ప్రశ్న: బస్సుల కొరత ఉందా?

జ: పొన్నూరు ఆర్టీసీ డిపో కింద ప్రస్తుతం 33బస్సులు ఉన్నాయి. ఇటీవలే మూడు కొత్త బస్సులను ఉన్నతాధికారులు ఆర్టీసీ డిపోకు కేటాయించారు. ఈ కొత్త బస్సులను చీరాల గుంటూరు మార్గంలో నడపాలని నిర్ణయించాం. మరిన్ని కొత్త బస్సులు కేటాయిస్తే పొన్నూరు మండలంలోని పలు గ్రామాలను కలుపుతూ కొత్త రూట్‌లో బస్సులను నడపాలని ప్రతిపాదనలను అందచేశాం.

ప్రశ్న: డిపో లాభ నష్టాలు?

జ: పొన్నూరు డిపో పునః ప్రారంభం నాటినుంచి నష్టాల్లోనే నడుస్తోంది. 33 బస్సులు ఉన్నప్పటికి సగటున ఏడాదికి రూ.4కోట్ల నష్టం వాటిల్లుతోంది. ఈ ఏడాది ఆ నష్టాలను తగ్గించగలిగాం. రహదారులు సక్రమంగా లేని కారణంగా బస్సులు మరమ్మతులకు గురవటం, మైలేజీ తగ్గిపోవటం వంటి కారణాలతో నష్టాలు వస్తున్నాయి. నష్టాలను తగ్గించి లాభాల బాటపట్టేలా కృషి చేస్తాం.



అత్తోట సమీపంలో కోతకు గురైన సిమెంట్ రోడ్డు

కోతకు గురైన శ్మశానానికి వెళ్లే సిమెంట్‌రోడ్డు

కొల్లిపర మండలం అత్తోటలో శ్మశానానికి వెళ్ళటానికి చెరువు పక్కనుంచి పంచాయతీరాజ్ నిధులతో సీసీరోడ్డు నిర్మించారు. భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురై పూర్తిగా దెబ్బతింది. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సీసీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని అనేక పర్యాయాలు పంచాయతీరాజ్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పంచాయతీరాజ్ అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. - కొల్లిపర, ఆంధ్రజ్యోతి

'ప్రజల కోసం పనిచేసే నాయకుడు ధూళిపాళ్ల'

పొన్నూరు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం అనునిత్యం పనిచేసే నాయకుడు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అని ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బాపనపల్లి ప్రభాకర లక్ష్మీప్రసాదరావు అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఆర్యవైశ్య సంఘం నాయకుల సమావేశం జరిగింది. అలాగే వివిధ గ్రామాల మాజీ ఎంపీటీసీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తీర్మానాలు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌కు మంత్రి పదవులు కేటాయించకపోవటం జీర్ణించుకోలేకపోతున్నామని వైసీపీపై రాజీలేని పోరాటం సాగించి జైలుపాలయ్యారని సంగం డెయిరీని ఆక్రమించుకోవాలని చూసిన వైసీపీ ఆటలు సాగనివ్వలేదన్నారు. అనునిత్యం ప్రజల కోసం పాటుపడే నరేంద్ర కుమార్‌కు మంత్రి పదవి ఇవ్వాలని సమావేశంలో నాయకులు డిమాండ్ చేశారు.

● పెదకాకాని: పొన్నూరు నియోజకవర్గంలో ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌కు మంత్రి పదవిని టీడీపీ అధిష్టానం ఇవ్వకపోవడంపై పెదకాకాని మండల ఎస్సీ కమిటీ నాయకులు తీవ్ర మనస్తాపానికి గురయ్యామన్నారు. ఆదివారం పెదకాకాని మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలువురు ఎస్సీ సెల్ నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ జగన్మోహన్ రెడ్డిపై పోరాటాలు చేసింది రాష్ట్రంలో ఒకే ఒక వ్యక్తి అది ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మాత్రమేనన్నారు. క్రమశిక్షణ, పార్టీపై నిబద్ధత తెలుగుదేశం పార్టీని ప్రాణంగా భావిస్తూ అహర్నిశలు పార్టీ అభివృద్ధి కోసం ప్రజల పక్షాన నిరంతరం పోరాడే వ్యక్తి నరేంద్ర కుమార్ అన్నారు. వైసీపీ ప్రభుత్వం సంగం డెయిరీని ఆక్రమించుకునేందుకు చేసిన ఎన్నో ప్రయత్నాలను అడ్డుకొని నెల రోజులు పాటు జైలుకెళ్ళింది నరేంద్ర కాదా అని ప్రశ్నించారు. పోతిరెడ్డిపాడు అల్మట్టి డ్యామ్ దగ్గర చంద్రబాబు నాయుడుతో పాటు పోరాటాలు చేసింది, వైసీపీ ప్రభుత్వంలో అక్రమ కేసులకు గురైన వ్యక్తి ధూళిపాళ్ళ నరేంద్ర మాత్రమే అన్నారు. అందరం పార్టీ క్రమశిక్షణకు లోబడి తమ ఆవేదనను తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లడం కోసం మాత్రమే నిరసనను తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పెదకాకాని మండల తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామం నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధం కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.